
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టి శ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు


మంగళవారం 6 మే 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.6	29.6
కావలి	38	28
ఆత్మకూరు	40	28
ఉదయగిరి	40	27
కందుకూరు	36	28



మెట్టకు మేలు జరిగేనా!?



- పాతికేళ్లుగా జరగని లోకలైజేషన్ ప్రక్రియ
- లేఅవుట్లుగా మారిన వేల ఎకరాల పొలాలు
- అయినా పాత లెక్క ప్రకారమే నీటి కేటాయింపులు
- తొమ్మిది నెలల క్రితం మంత్రులు, కలెక్టర్ ఆదేశం
- నేటికీ తేలని వాస్తవ ఆయకట్టు
- మొదట ఇరిగేషన్.. తర్వాత రెవెన్యూ శాఖల నిర్లక్ష్యం

జిల్లాలో లోకలైజేషన్ ప్రక్రియ (వాస్తవ ఆయకట్టు నిర్ధారణ) ప్రహసనంగా మారింది. ఎప్పుడో రెండున్నర దబ్బాల క్రితం నిర్ధారించిన ఆయకట్టు ప్రకారమే ఇప్పటికీ సోమశిల, కండలేరు జలాశయాల నుంచి నీటి కేటాయింపులు జరుపుతున్నారు. ఈ పాతికేళ్లలో కొన్ని వేల ఎకరాల పొలాలు లేఅవుట్లుగా, చేపలు, రొయ్యలు గుంటలుగా మారిపోయాయి. ఇలా తగ్గిన భూమి స్థానంలో మెట్ట ప్రాంతాల్లోని భూములను స్థిరీకరించాలని కొన్నేళ్ల నుంచి విజ్ఞప్తులు అందుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ అంశంపై దృష్టి సారించింది. ప్రస్తుతం ఏ కాలువ కింద ఎంత వాస్తవ ఆయకట్టు ఉందో లెక్క తేల్చాలంటూ తొమ్మిది నెలల క్రితం జిల్లాకు చెందిన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణతోపాటు కలెక్టర్ ఓ ఆనంద్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. కానీ నెలలు గడుస్తున్నా ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. గత నెలలో జరిగిన ఐఏబీలోనూ ఈ అంశం చర్చకు రావడం గమనార్హం.

నెల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రధానమైనది పెన్నా డెల్టా. సోమశిల కింద 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంటే అందులో మెజారిటీ పెన్నా డెల్టాలోనే ఉంది. సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కోవూరు, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల పరిధిలో డెల్టా విస్తరించి ఉంది. ఇప్పటి వరకూ కేటాయిస్తున్న నీటి లెక్కల ప్రకారం చూస్తే ఇది 2.47 లక్షల ఎకరాలుగా ఉంది. ఈ ప్రాంతాల్లో చాలా భూములు లేఅవుట్లుగా రూపాంతరం చెందాయి. మరికొన్ని భూములు చేపలు, రొయ్యల గుంటలుగా మారిపోయాయి. ముఖ్యంగా నెల్లూరు నగరం చుట్టు పక్కల వేల ఎకరాల పంట భూముల్లో లేఅవుట్లు వెలిశాయి. బుచ్చి, ఇందుకూరుపేట, విడవలూరు, కొడవలూరు ప్రాంతాల్లో చేపలు, రొయ్యల గుంటలు సాగు చేస్తున్నారు. అంతేగాక జిల్లాలో అనేక ప్రాంతాల్లో వేల ఎకరాల సాగు భూముల్లో సాగు జరగడం లేదు. కానీ ఈ భూములను కూడా లెక్కల్లోకి తీసుకొని ఏటా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశంలో నీటి కేటాయింపులు జరుపుతున్నారు. దీంతో నీరు వృథా అవుతోంది. నిబంధనల ప్రకారం అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు లోకలైజేషన్ చేయాల్సి ఉంటుంది. ఆ లెక్కల ప్రకారమే సాగునీటి కేటాయింపులు జరపాలి. కానీ జిల్లాలో ఈ పద్ధతిని అనుసరించడం లేదు. పాతికేళ్ల క్రితం సోమశిల ఆయకట్టును నిర్ధారించారు. ఏ కాలువ కింద ఎంత ఆయకట్టు ఉంది? ఏటా ఎంత నీరు కేటాయించాలి? అన్నది నిర్ణయించారు. ఇప్పటికీ ఆ దామాషా ప్రకారమే కేటాయింపులు జరుగుతున్నాయి.

అంతులేని అలసత్వం

రైతుల విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న మంత్రులు.. వీలైనంత త్వరగా లోకలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ కూడా పలు మార్లు సమావేశాలు నిర్వహించి లోకలైజేషన్ వేగంగా పూర్తి చేయాలని సూచించారు.. కానీ ఈ పని చేయాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు మాత్రం కదలడం లేదు. తొలుత లోకలైజేషన్ ప్రక్రియలో ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించగా, ఇప్పుడు ఆ వంతును రెవెన్యూ శాఖ పోషిస్తోంది. సర్వే నెంబర్ల వారీగా ఏ భూమి సాగు జరగడం లేదన్నది రెవెన్యూ శాఖకు తెలుస్తోంది. అలానే ఎక్కడెక్కడ అనధికారికంగా సాగు చేస్తున్నారన్నది కూడా వారే చెప్పగలరు. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం ఇరిగేషన్ అధికారులు సహకరించడం లేదు. దీంతో లోకలైజేషన్ ప్రక్రియ మరింత ఆలస్యమవుతోంది.

కొత్త ఆయకట్టుకు అవకాశం

సోమశిల కింద డెల్టాలోని భూములకు నీరిచ్చాకనే మిగిలిన ప్రాంతాలకు కేటాయింపులు జరపాలని నిబంధనలు ఉన్నాయి. ఇప్పుడు డెల్టాతోపాటు అన్ని కాలువల కింద ఉన్న ఆయకట్టులో కొన్ని వేల ఎకరాల సాగు భూములు మాయమయ్యాయి. ఆ లెక్క తేలిస్తే ప్రస్తుతం ఏ కాలువ కింద ఎంత ఆయకట్టు ఉందన్న విషయం స్పష్టమవుతుంది. దీంతో ప్రస్తుత స్థిరీకరణ ఆయకట్టు తగ్గుతుంది. ఎంత మేర తగ్గిందో అదే స్థాయిలో కొత్త ఆయకట్టును సోమశిల కింద స్థిరీకరించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఇది మెట్ట ప్రాంత రైతాంగానికి ఎంతో ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. డెల్టాలో తగ్గిన వేల ఎకరాల ఆయకట్టు మెట్టలో స్థిరీకరణ జరిగి సాగులోకి వస్తుంది. తద్వారా మెట్టలో కాలువలను కూడా బాగు చేసుకునేందుకు వీలు పడుతుంది. ఇటీవల ఇరిగేషన్ అధికారులు ప్రాథమిక సర్వే చేయగా ఒక్క డెల్టాలోనే సుమారు 30 వేల ఎకరాలకు పైగా పొలాలు కనుమరుగైనట్లు తేలింది. అదే విధంగా జిల్లా మొత్తం చూస్తే ఇంకెన్ని వేల ఎకరాల ఆయకట్టు తగ్గిందో అర్థం చేసుకోవచ్చు. లోకలైజేషన్ పూర్తయితే ఆయకట్టు కింద తగ్గిన విస్తీర్ణం దామాషాను నాన్ ఆయకట్టు కింద స్థిరీకరణ చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది.



ముత్తుకూరులో లేఅవుట్‌గా మారిన పంట పొలం

రేపటి నుంచి రెండో పంటకు నీరు

- ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్

నెల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : రెండో పంట సాగుకు సంబంధించి బుధవారం నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ శాఖ ఎస్ఈ దేశా నాయక్ వెల్లడించారు. గత నెలలో జరిగిన సాగునీటి సలహా మండలి (ఐఏబీ)లో తీసుకున్న నిర్ణయాల ప్రకారం నీటి విడుదల జరుగుతుందని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమశిల డ్యాం నుంచి రోజుకు 1500 క్యూసెక్కుల చొప్పున సాగుకు విడుదల చేయనున్నట్లు చెప్పారు. డెల్టాలో రెండు లక్షల ఎకరాలకు, కనుపూరు కాలువ కింద 20 వేల ఎకరాలకు నీరు ఇస్తున్నట్లు తెలిపారు. రైతులంతా నీటిని సక్రమంగా వినియోగించుకుంటూ సాగు చేసుకోవాలని ఎస్ఈ కోరారు. ఎక్కడైనా తలెత్తితే ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.



సోమశిల జలాశయం (ఫైల్)

బ్రహ్మోత్సవ శోభ

- వేదగిరిలో వార్షిక వేడుకలకు నేడు అంకురార్పణ

వేదగిరి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి ఈ ఉత్సవాలు జరుగుతుండటంతో అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికార యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఇప్పటికే ఏర్పాటైన ఉత్సవ కమిటీ తరలివచ్చే భక్తుల కోసం మంచినీరు, పారిశుధ్యం, భద్రత, రవాణాకు తొలి ప్రాధాన్యం ఇచ్చింది. 11వ తేదీన స్వామి వారికి బంగారు గరుడసేవ, 12న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనృసింహస్వామి కల్యాణం జరగనుంది. ఆ మరుసటి రోజు నూతన వధూవరులను నరసింహపురం పురవీధుల్లో రథంపై ఊరేగించనున్నారు.



నెల్లూరురూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) :నెల్లూరు నగరానికి పడమర వైపున, పెన్నానదికి సమీపాన వెలసియున్న వేదగిరి లక్ష్మీనరసింహస్వామి వార్ల బ్రహ్మోత్సవాలను ఈసారి అట్టహాసంగా జరిపించేందుకు సర్వం సిద్ధమైంది. క్షేత్రాన్ని శోభయామానంగా తీర్చిదిద్దుతున్న అధికారులు, ఉత్సవ కమిటీ వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని కొండపైకి తరలివచ్చే భక్తజనానికి చల్లని చలువపందిళ్లు నిర్మిస్తున్నారు. నగరంలోని ములుముడి బస్టాండ్ నుంచి కొండపైకి ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, భక్తులకు భద్రతను కట్టుదిట్టం చేయనున్నారు. 300 మంది పోలీసులతో పహారా ఏర్పాటు చేయనున్నట్లు ఆ శాఖ ప్రకటించింది. దేవరపాళెం పంచాయతీతోపాటు పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక పారిశుధ్య పనులను నిర్వహించనుంది. సౌత్‌మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం చొరవతో నెల్లూరులోని కార్పొరేట్ హాస్పిటళ్లతో శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఈసారి కొండపై పార్కింగ్ ప్రాంతాలను పెంచుతున్న అధికారులు, జొన్నవాడ రేవు నుంచి కొండపైకి పైపుల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళిక తయారు చేశారు.

ఉత్సవాలు ఇలా..

6వ తేదీన రాత్రి 7 గంటలకు అంకురార్పణ
7న ఉదయం చప్పర ఉత్సవం, ధ్వజారోహణం, రాత్రి 8 గంటలకు శేషవాహన సేవ
8న రాత్రి హంసవాహనం
9న రాత్రి సింహవాహనం
10న రాత్రి హనుమంత సేవ
11న సాయంత్రం మోహినీ ఉత్సవం, అఖండ జ్యోతి, అర్ధరాత్రి 12 గంటలకు బంగారు గరుడసేవ
12న రాత్రి కల్యాణ మహోత్సవం, అర్ధరాత్రి 12 గంటలకు గజవాహన సేవ
13న ఉదయం నరసింహపురంలో రథోత్సవం
14న రాత్రి 8 గంటలకు అశ్వవాహన సేవ
15న ఉదయం ఏడుకోన్నేళ్ల వద్ద తీర్థవాది, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణం
16న సాయంత్రం పుష్పయాగం, రాత్రి 9 గంటలకు ఏకాంతసేవ

గజ ఈతగాళ్లతో నిఘా

వేదగిరిలోని ఏడుకోన్నేళ్ల వద్ద అగ్నిమాపక దళం గజ ఈతగాళ్లతో నిఘా ఉంచింది. చెంచులక్ష్మి అమ్మవారి వంశీకులైన చెంచుకులస్థులు కొండ పరిసర ప్రాంతాలలో వేడుకలు పూర్తయ్యే వరకు ఉంటారు. వారందరికీ అన్ని సౌకర్యాలను సమకూర్చనున్నారు.

భక్తులకు ఏలోటు రానివ్వం

ఈసారి బ్రహ్మోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాము. ఎక్కడా చిన్న లోపం కూడా రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాము. తాగునీరు, పారిశుధ్యం, భక్తులకు భద్రత, రవాణ సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నాము. ఎవరైన సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాము.

- అచ్యుత శంకర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్

డెంగ్యూ, మలేరియా కేసులను గుర్తించండి

- మలేరియా నివారణ అధికారి డాక్టర్ హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా కేసులను వెంటనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. సోమవారం డీ ఎంహెచ్‌వో కార్యాలయంలో మలేరియా సబ్ డివిజన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా లో శాశ్వత నీటినిల్వలను గుర్తించి, వాటిలో దోమల లార్వా ఉన్నట్లయితే నివారణ చర్య లు తీసుకోవాలన్నారు. మురుగుగుంతల్లో గంబూజియా చేపలను వదలాలని చెప్పా రు. ప్రస్తుతం సెలవులు ఉన్న కారణంగా ప్రభుత్వ వసతి గృహాలలో పర్యటించి మస్కి టో నెట్‌ల ఏర్పాటుకు సిఫార్సు చేస్తామన్నా రు. దోమల కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటింటికి తిరిగి హెచ్చరించా లని ఆమె తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్‌వో నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా లేఅవుట్ల సర్వే

- ఎవరూ నష్టపోకుండా చర్యలు
- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(జడ్పీ), మే 5 (ఆం ధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు పకడ్బం దీగా సర్వే చేస్తున్నట్లు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. నుడా కార్యాలయంలో సోమవారం సర్వే బృందాలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణపై మం త్రి నారాయణ ప్రత్యేకశ్రద్ధ వహించారని, 17 మంది అధికారుల ను సర్వే కోసం జిల్లాకు పంపారని తెలిపారు. వారంతా స్థానిక అధికారులతో కలసి జిల్లాలోని అన్నీ లేఅవుట్లను సర్వే చేస్తారని తెలిపారు. ఎవరూ నష్టపోకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆయ న వివరించారు. ఇందుకు అంతా సహకరించాలని కోరారు. నుడా పరిధిలోని లేఅవుట్లను భౌతికంగా సర్వే చేసి, గ్రామ, నగర స్థాయిలో లేఅవుట్లలో నిబంధనలు అమలు జరిగాయా... లేదా... అని పరిశీలిస్తారని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాను పైలెట్ ప్రాజె క్టుగా మంత్రి నారాయణ తీసుకున్నారని కోటంరెడ్డి తెలిపారు. జిల్లాలో జరిగే సర్వే అధారంగా రాష్ట్రమంతా క్రమబద్ధీకరణకు అమలుకు చర్యలు తీసుకుంటారని వివరించారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ జేడీ మహాలక్ష్మి, అధికారులు సంజీవ్, హిమ బిందు, నుడా కార్యదర్శి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

ముత్తుకూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమని జెన్కో కార్మికులు హెచ్చరించారు. నేలటూరు జెన్కో థర్మల్ కేంద్రం ఎదుట సోమవారం వారు మానవహారం నిర్మించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికుల సంఘం నాయకులు మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి 25రోజులుగా శాంతియుత నిరసన తెలుపుతున్నా అధికారులు స్పందించలేదన్నారు. థర్మల్ కేంద్రంలోని ఏహెచ్‌పీ, సీహెచ్‌పీ, ఈసీసీఎస్ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులకు కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.



థర్మల్ కేంద్రం ఎదుట కార్మికుల మానవహారం

ఎంప్లాయిమెంట్ రిటర్న్స్ సమర్పించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 5 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్, ప్రైవేట్ ఎస్టాబ్లిస్‌మెంట్ రిటర్న్స్ కోసం సంవత్సరంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆన్‌లైన్ ద్వారా ఎంప్లాయిమెంట్ రిటర్న్స్ సమర్పించాలని జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. **www.emplament.ap.gov.in** అనే వెబ్‌సైట్‌లో ఎంప్లాయిమెంట్ లాగిన్ ద్వారా ఎంప్లాయిమెంట్ రిటర్న్స్ సమర్పించాలన్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే 96426 53931, 91608 88066 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బీమాతో భరోసా!

- 'ఉపాధి' శ్రమజీవులకు ఊరట
- పనిచేస్తూ మరణిస్తే రూ.2లక్షలు
- గాయపడితే చికిత్సకు బిల్లు పెట్టుకునే వీలు

ఉదయగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులు చేసే శ్రమజీవులకు ప్రభుత్వం బీమాతో భరోసా కల్పించాలని నిర్ణయించింది. పని చేస్తుండగా మృతి చెందితే రూ. 2లక్షలు, గాయపడితే వైద్యానికి బిల్లు పెట్టుకోవానికి వీలు కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో సుమారు 2.81 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 4.43 లక్షల మంది కూలీలు ఉన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో అన్ని మండలాల్లోనూ ఉపాధి హామీ పథకం శ్రమజీవులకు ఈ బీమాను వర్తింప చేయనున్నారు. మండలస్థాయి అధికారులు శ్రమజీవులకు అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.ఉపాధి శ్రమజీవుల వివరాలను వెంటనే నమోదు చేయించేలా చూడాలని క్షేత్రస్థాయి పరిశీలకులను ఉన్నతాధికారులు ఆదేశించారు. దరఖా స్తుల స్వీకరణ ముమ్మరంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కార్మికులు

20న సమ్మె చేస్తాం!

- డీఎంహెచ్‌వోకి ఆశా నేతల నోటీసు

నెల్లూరు (వైద్యం) మే 5 (ఆంధ్రజ్యోతి) : డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతకు ఏఈ ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు సోమవారం సమ్మె నోటీసు ఇచ్చారు. తమకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న సమ్మెలో పాల్గొంటున్నట్టు వారు ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడారు. యాజమానులకు కట్టుబానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 20 ఏళ్లగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలను, కార్మికులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని కోరారు. ఆశాలను కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌గా గుర్తించి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని కూడా వారికి వర్తింప చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి మధుసూదన, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో సుజాతకు సమ్మె నోటీసు ఇస్తున్న ఆశాల యూనియన్ నేతలు

పైలాన్ ధ్వంసం..

- ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు
- మాజీ ఎమ్మెల్యే ప్రతాప్, వైసీపీ నాయకులపై కేసు
- ఇప్పటికే నలుగురి అరెస్ట్.. రిమాండ్
- నిందితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం

వైసీపీ నాయకుల కోసం ఆరా

కావలి, మే 5 (ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణానికి మంచినీటి సరఫరా కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన అమృత్ పథకం పైలాన్ ధ్వంసం చేసి ఐదేళ్లు దాటిన తర్వాత నిందితులను ఎట్టకేలకు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే 12 మందిని గుర్తించి వారిలో నలుగురిని అరెస్ట్ చేయగా, మిగలిన 8 మంది కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. అయితే ఎఫ్ఐఆర్‌లో కొంతమంది వైసీపీ నాయకుల పేర్లు ఉండటంతో ఆ పార్టీలో కలవరం మొదలైంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన జగన్ మీడియా ప్రతినిధి కుర్రు శ్రీనివాసరావు, ఇతర విలేకరులు కేదారు మాలకొండయ్య, బెహరా వెంకట లక్ష్మీనారాయణ, వానింబేడి ప్రసాద్‌లను మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా వారికి రిమాండ్ విధించటంతో కావలి సబ్ జైలుకు తరలించారు. వీరు ఇచ్చిన వివరాల ప్రకారం శ్రావణ్‌కుమార్, జ్యోతి అనిల్, వెంకట్రావు, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డిప్రతాప్ కుమార్ రెడ్డి, మన్నెమాల సుకుమార్ రెడ్డి, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, చెన్ను ప్రసాద్ రెడ్డిల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ప్రస్తుతం వీరంతా పరారీలో ఉన్నారు. వీరుగాక ఇంకొంతమంది నాయకుల పేర్లు ఎఫ్ఐఆర్‌లో చూపడంతో అందరిలోనూ గుబులు మొదలైంది. వైసీపీ నాయకులు, విలేకరులతోపాటు పైలాన్‌ను ధ్వంసం చేసిన ఎక్స్‌కవేటర్లు, రాత్రికిరాత్రే శిథిలాలను తరలించిన ట్రాక్టర్ల నిర్వాహకులతో కలిపి సుమారు 30 మంది వరకు ఈ కేసులో నిందితులు ఉండవచ్చని పోలీసులు అనధికారికంగా వెల్లడిస్తున్నారు.

జరిగింది ఇదీ..

8-1-2018లో అప్పటి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కావలిలో అమృత్ పథకం పైలాన్‌ను ఆవిష్కరించారు. అయితే అప్పటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పైలాన్ ఆవిష్కరణలో ప్రొటోకాల్ పాటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు పైలాన్‌ను పగలగొట్టి ఆ స్థానంలో ప్రెస్‌క్లబ్ భవనం నిర్మిస్తామని ఎమ్మెల్యే రామిరెడ్డి చెప్పగా ఇందుకు విలేకరులలో కొంతమంది వ్యతిరేకించి ఈ వ్యవహారంపై అప్పటి సబ్‌కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, డీఎస్పీల దృష్టికి తీసుకెళ్లారు. కాగా, 10-4-2020న రాత్రి వరకు ఉన్న పైలాన్ 11వ తేదీ తెల్లారేసరికి మాయమైంది. ఆ మరుసటి రోజు అక్కడ ప్రెస్‌క్లబ్ భవనం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమానికి అధికారులను ఆహ్వానిస్తూ కావలి జర్నలిస్టుల పేరుతో ఓ ఫ్లెక్సీ వెలసింది. ఆ తర్వాత ప్రెస్‌క్లబ్ భవనానికి శంకుస్థాపన కూడా జరిగింది. పైలాన్ ధ్వం సంపై అప్పటి కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, వైసీపీ అధికారంలో ఉండటంతో నిందితులు దొరకలేదంటూ పోలీసులు కేసును క్లోజ్ చేశారు. గతేడాది అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి నాయకులు పైలాన్ ధ్వంసం కేసులో నిందితులెవరో తేల్చాలని పోలీస్‌లకు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు పోలీస్‌లు విచారించి నిందితులను అరెస్ట్ చేసి విచారించగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌తోపాటు పలువురు వైసీపీ నాయకులపై కేసు నమోదు చేశారు. కాగా, ఈ కేసులో ప్రధానంగా వైసీపీ నాయకులు ఉండగా వారిని కాదని విలేకరులనే ప్రధానంగా చేర్చడం కావలిలో చర్చ నీయాంశమైంది.



పైలాన్‌ను ధ్వంసం చేసిన స్థలంలో జర్నలిస్టుల పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ (ఫైల్)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	262
కోడిగుడ్ల ధర (100) : 500	

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9154
వెండి కిలో ధర	రూ. 96.900
వెండి ఒక గ్రాము	రూ.99.90

చిరువ్యాపారుల కోసమే షాపింగ్ కాంప్లెక్స్

కావలి, మే 5(ఆంధ్రజ్యోతి): చిరువ్యాపారుల కోసమే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి వారికి తక్కువ ధరకు అద్దెకు ఇవ్వనున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో నిర్మిస్తున్న మున్సిపల్ షాపింగ్ రూములను సోమవారం ఎమ్మెల్యే మున్సిపల్ డీఈ సాయిరాంతో కలిసి పరిశీలించారు. ఉదయగిరి రోడ్డులో 360 షాపులను నిర్మిస్తున్నామని, త్వరలో ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయం, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఎదుట షాపులు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు కావలి మండల సర్వసభ్య సమావేశం

కావలి రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కావలి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, జడ్పీటీసీ, కో ఆప్షన్ సభ్యుడు, సర్పంచులు, హాజరు కావాలని, మండలస్థాయి అధికారులు సమగ్ర నివేదికతో పాల్గొనాలని తెలిపారు.

10 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

కందుకూరు, మే 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో ఈనెల 10 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణకు కొత్తబ్యాచ్‌లు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఆపై విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులంతా ఈ కంప్యూటర్ శిక్షణకు హాజరయ్యేందుకు అర్హులేనని వివరాలకు 9848050543ను సంప్రదించాలని స్కిల్ హబ్ సెంటర్ కో ఆర్డినేటర్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు.

పీజీఆర్‌ఎస్‌కు 2 వినతులు

కొండాపురం, మే 5(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదికకు బాధితుల నుంచి 2 వినతులు అందినట్లు తహసీల్దారు కోటేశ్వరరావు, ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. మండలస్థాయిలో అన్ని శాఖల అధికారుల సమక్షంలో ప్రతి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి అందిన 2 వినతులు పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

కిలో పొగాకు రూ.180

కలిగిరి, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 327 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 282 బేళ్ల కొనుగోలు చేశారు. నోబిడ్-35, ఆర్‌ఆర్-3, సీఆర్-2, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 282 బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.253.81గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టీ ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

ఆదర్శ నేత కలికి యానాదిరెడ్డి

● ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే, వివిధ రాజకీయ పార్టీల నేతలు

కావలిటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): కావలి నుంచి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలవడమే కాక మంత్రి పదవి అలంకరించిన ఏకైక నేత కలికి యానాదిరెడ్డి ఆదర్శ రాజకీయ నాయకుడని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కొనియాడారు. మాజీ మంత్రి కలికి యానాది రెడ్డి 19వ వర్థంతిని పురస్కరించుకుని ట్రంకు రోడ్డు బ్రిడ్జి కూడలిలోని ఆయన విగ్రహం వద్ద సోమవారం కలికి అభిమానుల ఆధ్వర్యంలో వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ, వైసీపీ, వివిధ పార్టీల నేతలు, అభిమానులు పాల్గొని కలికి విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. అనంతరం ఏరియా వైద్యశాల ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత కలికి యానాదిరెడ్డి, గొట్టిపాటి కొండపనాయుడులు కావలి రాజకీయాలలో ఒక ధ్రువతారలుగా వెలుగొందారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కనమర్లపూడి నారాయణ, దామిశెట్టి సుధీర్ నాయుడు, గంధం ప్రసన్న, కుందుర్తి సోదరులు, రాజు, గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, పోట్లూరు శ్రీనివాసులు, పోతుగంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కలికి యానాదిరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, నేతలు

మా పొలాలకు దారి చూపించండి

కందుకూరు, మే 5(ఆంధ్రజ్యోతి) : మా పొలాలకు దారి చూపించాలని కోరుతూ గుడ్లూరు మండలం పూరేటిపల్లి గ్రామానికి చెందిన రైతులు సోమవారం కందుకూరు సబ్‌కలెక్టరు తిరుమణి శ్రీపూజను కలిసి విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా రోడ్డు నుంచి పొలాల్లో గుండా ఎగువన ఉన్న పొలాలకు ట్రాక్టర్లు, ఎడ్లల బండ్లు వెళ్లేందుకు దారి ఉండేదని, పంటలకు ఎరువులు తీసుకెళ్లాలన్నా, పంట ఉత్పత్తులు ఇళ్లకు తెచ్చుకోవాలన్నా ఈ దారే శరణ్యమని, ఇటీవల సర్వే నెం.283లోని భూములను ఒంగోలుకు చెందిన వ్యక్తులు కొనుగోలు చేసి దారి మూసివేశారన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గనిపినేని వెంకటేశ్వర్లు, మరికొందరు రైతులు సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు కలిసి వినతిపత్రం అందజేశారు.



సబ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వలేటివారిపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాఖవరం హైస్కూల్‌లో 1982-87వ సంవత్సరాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు డీ.జానకిరామయ్య, జీవీ.రంగయ్య, ఎస్‌కే.బేగం, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు పీ.చిన్నయ్యలను శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతో ఉన్నత స్థాయిలో ఉన్నారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.నాగేంద్రరావు, ఎన్.శ్రీనివాసులు, కే.వెంకటేశ్వర్లు, వీ.మల్లికార్జున, వీ.బ్రహ్మయ్య, ఎస్‌కే.ఫిరోజ్, జీ.అరుణ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కావలిటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యనభ్యసించాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని కావలి ఎంఈఓ-2 వెంకటసుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ప్రవేశానికి విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం దారిద్ర రేఖకు దిగువనున్న పేద విద్యార్థులకు 25శాతం సీట్లు ఇస్తుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అనాథ విద్యార్థులు ఉచిత విద్య పొందేందుకు ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు, ఫొటోతో ఈనెల 15 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

డీఎస్సీ ప్రిపరేషన్‌కు సమయం పెంచాలి : సీపీఎం



ఆర్డీవోకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కావలి, మే 5(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ప్రిపరేషన్ సమయం 90 రోజులకు, వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలని, రెండవసారి టెట్ నిర్వహించాలని సీపీఎం సీనియర్ నాయకుడు తాళ్లూరు మాల్యాద్రి కోరారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఆర్డీవో ఎం. వంశీకృష్ణకు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సీతారామయ్య, కార్యదర్శి రాధా కృష్ణయ్య, తదితరులు తెలిపారు.

మంచినీటి సమస్యపై చర్యలు చేపట్టండి

లింగసముద్రం, మే 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తితే చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులను, బోరు మెకానిక్‌లను ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన పంచాయ తీ కార్యదర్శులు, బోరు మెకానిక్‌లతో చర్చిం చారు. సచివాలయాల్లో కార్యదర్శులతో ఫోన్‌లో మాట్లాడారు. ఎక్కడైనా మంచినీటి పైపులు పగిలి, నీటి సరఫరా నిలిచిపోతే వెంటనే చర్యలు తీసుకొని మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. చేతి పంపులు మరమ్మతులకు గురైతే తక్షణం బాగు చేయించాలని చెప్పారు. వేసవిలో ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన

కావలిటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గొబ్బెళ్ల కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కో పాఠశాలను ఒక్కో విధంగా పరిగణలోకి తీసుకుంటూ ఉపాధ్యాయుల కేటాయింపులో అన్యాయంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులను గందరగోళానికి గురిచేస్తుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శంగా చేపట్టాలని, పీఆర్సీలో భాగంగా ఇంటీరియం రిలీఫ్ ఇవ్వాలని, పెండింగ్ బాకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారు శ్రావణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీ ఎఫ్ నాయకులు మధుసూదన్‌రావు, కే.రఘునాథరావు, పెంచలయ్య, రమణకుమార్, సమాధి వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, రాజయ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఫీల్డ్ అసిస్టెంట్‌గా పెంచలయ్యను నియమించాలి

● ఎంపీడీవో కార్యాలయంలో బైఠాయించిన టీడీపీ నేత, రెండు గ్రామాల ప్రజలు

దగదర్తి(బిట్రగుంట), మే 5 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ పాలనలో పనిచేసిన పెంచలయ్యను ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించాలని ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్ర నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు దగదర్తి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం దగదర్తి, చెన్నూరు గ్రామాల ప్రజలతో కలిసి ఆయన బైఠాయించారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన పెంచలయ్యను వైసీపీ ప్రభుత్వ పాలనలో తీసివేశారన్నారు. ప్రస్తుతం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వ్యక్తి టీడీపీ పార్టీ కార్యకర్తలకు ఉపాధి హామీ పనుల్లో తీవ్ర అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ఇరుగ్రామాల ప్రజలకు ఉపాధిహామీ పనుల్లో న్యాయం జరగాలంటే పెంచలయ్యను ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించాలని కోరుతూ ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందచేశారు. ఆయన వెంట స్థానిక నేతలు కంచర్ల కృష్ణయ్య, రమణమ్మ, ప్రజలు తదితరులు ఉన్నారు.



కార్యాలయంలో బైఠాయించిన గ్రామస్థులు

అదుపుతప్పి టమోటా లారీ బోల్తా

వలేటివారిపాలెం, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకవరం-బడేవారిపాలెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై సోమవారం ఉదయం 6 గంటల సమయంలో టమోటా లారీ అదుపుతప్పి బోల్తా పడింది. కడప నుంచి కందుకూరుకు వేగంగా వస్తున్న ఈ లారీ మలుపు వద్ద అదుపు తప్పి పడింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి ప్రమాదం లేకుండా సురక్షితంగా బయటపడ్డారు.



జాతీయ రహదారిపై బోల్తాపడిన లారీ

హైవేపై కారు..

జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న కారు మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడిన ఘటన మండలంలోని బడేవారిపాలెం సమీపంలో సోమవారం జరిగింది. ఆ కారులో ఉన్న డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. విజయవాడ నుంచి కడపకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆ మలుపులో ఉదయం ఒక ప్రమాదం. సాయంత్రం మరో ప్రమాదం జరిగింది.

12 నుంచి నాటక పోటీలు

లింగసముద్రం : మండలంలోని పెదపవనిలో ఎం.రాఘవేంద్ర స్మారక నాటక కళా పరిష త్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 15 వరకు తృతీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీ లు జరుగుతాయని పెదపవని పావని ఆర్ట్స్ అధ్యక్షుడు మలిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షు డు సీహెచ్ వెంక్రటావులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యా వ్యవస్థలో అసంబద్ధ విధానాలు సరిచేయాలి

● ఏపీటీఎఫ్ నిరసన

ఉదయగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో అసంబద్ధ విధానాలు వెంటనే సరిచేయాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పీ తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఒకేలా ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఉద్యమిస్తోందన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ 30శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మాల్యాద్రి, ఎండీ ఖాజా, ఓబులేసు, షబ్బీర్, నాగేశ్వరరావు, రమేష్, మాధవరాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

స్లాట్ బుకింగ్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ ఫర్ స్టాంప్స్ శాఖలో నూతనంగా అమలవుతున్న స్లాట్ బుకింగ్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సబ్ రిజిస్ట్రార్ మెల్కిరోషన్ సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఈ విధానం ప్రజలకు సౌకర్యవంతంగా, సౌలభ్యంగా ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ ఏరోజు చేసుకోవాలనుకుంటున్నారో ముందుగా ఆ సమయానికి బుక్ చేసుకొని సమయానికి కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ విధానం ద్వారా సమయం ఆదా అవుతుందన్నారు. రోజుకు 36 స్లాట్స్ ఇచ్చారన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

చేజర్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవచౌదరి, మండల టీడీపీ కన్వీనర్ రావి లక్ష్మీనరసారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఇడబ్ల్యూఎస్ వారి సహకారంతో పేద మహిళల కోసం ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని చేపట్టిందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు బి మురళి, ఎంపిడివో విజయలలిత పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ గ్రామోత్సవం

సంగం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధీపురం దళితవాడలో ఉన్న పోలేరమ్మ ఆలయం వార్షికోత్సవంలో భాగంగా సోమవారం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం పొంగళ్లు పొంగించారు. అనంతరం పోలేరమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని పూలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ గ్రామోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ప్రభుత్వ భూముల్లో కలప నరికివేతపై ఫిర్యాదు

దుత్తలూరు(ఉదయగిరి), మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవరం గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిలో కలపను కొందరు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్థులు సోమవారం తహసీల్దారు వై నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా కలప నరికివేతపై జిల్లా కలెక్టర్, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈవిషయమై వీఆర్వో మాల్యాద్రిని వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కలప నరికివేతను నిలిపివేశామన్నారు.

సోమశిలలో 50.754 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 50.754 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 1,000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధిలో కమిటీలు ఎంతో కీలకం

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్

దుత్తలూరు (ఉదయగిరి), మే 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో తెలుగుదేశం పార్టీ కమిటీలు ఎంతో కీలకం అని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని ఏరుకొల్లు, భైర వరం, రాచవారిపల్లి, మందాలనామయుడుపల్లి తదితర పంచాయ తీల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై కమిటీలను నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి ఆమోదంతోనే కమిటీల ఎంపిక జరుగుతుందన్నారు. మనస్పర్థలు వీడి పార్టీ, గ్రామాల అభివృద్ధికి కలిసి పనిచేయాలని సూచించారు. అనంతరం స్థానిక నాయకులు, ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, పొలిటికల్ మేనేజరు మాలేపాటి చైతన్య, నాయకులు చీకుర్తి రవీంద్ర బాబు, ఉండేలా గురవారెడ్డి, సుబ్బరాయుడు, చీదర్ల మల్లికార్జున, చేజర్ల భాస్కర్ రెడ్డి, లెక్కల వెంగళరెడ్డి పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కనుపూరు కాలువకు నీరు విడుదల

సంగం, మే 5 (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజి నుంచి కనుపూరు కాలువకు సోమవారం నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా కనుపూరు కాలువ ప్రాజెక్టు చైర్మన్ మస్తాన్ నాయుడు, డీఈ పాండురంగారెడ్డి కాలువ హెడ్ రెగ్యులేటర్ల వద్ద పూజలు చేశారు. అనంతరం హెడ్ రెగ్యులేటర్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నారుమళ్లు, పశువుల తాగునీటి అవసరాల మేరకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. తదుపరి సోమశిల జలాశయంలో నీటి విడుదలను బట్టి కనుపూరు కాలువకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు వెంకటేశ్వర్లు, వాసు, ఇరిగేషన్ సిబ్బంది, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



కనుపూరు కాలువకు నీటిని విడుదల చేస్తున్న చైర్మన్, ఇరిగేషన్ అధికారులు

వెంగమాంబ సన్నిధిలో టెండర్ల నిర్వహణ

దుత్తలూరు(ఉదయగిరి), మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు జరుగుతుండడంతో భక్తుల సౌకర్యార్థం వివిధ ఏర్పాట్లపై ఆలయ ఆవరణలో సోమవారం సీల్డు టెండర్లు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యుత్ దీపాలం కరణ, షామియానాలు, బాణసంచా, పుష్పాలంకరణ, జంగిల్ క్లియరెన్స్, రంగులు వేయుట తదితర వాటికి సీల్డు టెండర్లు నిర్వహించారు. ఈ సీల్డు టెండర్లను తక్కువ కోడ్ చేసిన వారు దక్కించుకున్నారు. అలాగే తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు వేలంపాట నిర్వహించగా ఎవరూ పాల్గొనక పోవడంతో వాయిదా వేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త తుమ్మల సురేష్‌బాబు, పచ్చవ కరుణాకర్‌బాబు, దేవదాయ ధర్మదాయ శాఖాధికారి గణపం రమణారెడ్డి, ఆలయ ఈవో ఉషశ్రీ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు

ఉదయగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఎంఈవో మస్తాన్‌వలి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో 1వ తరగతిలో చేరే విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. అనాథ, హెచ్‌ఐవీ బాధిత, ఎస్సీ, ఎస్టీ వర్గాల పిల్లలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన మైనార్టీ, బీసీ, ఓసీ వర్గీయులను అర్హులుగా నిర్ధారించడం జరుగుతుందన్నారు. అలాంటి వారు గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.20లక్షలు, పట్టణాల్లో రూ. 1.44 లక్షలు ఆదాయం కలిగి ఉండాలన్నారు. 15వ తేదీలోపు చేసుకున్న దరఖాస్తులను లాటరీ ద్వారా ఎంపికచేయడం జరుగుతుందని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమంగా జామాయిల్ కర్ర తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కలువాయి, మే 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా జామాయిల్ కర్ర తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని రామన్నగారిపల్లె సమీపంలో సోమవారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. చింతలపాళెం సమీపంలోని ఫారెస్ట్ ప్లాంటేషన్‌లో జామాయిల్ చెట్లను దొంగతనంగా నరికి తీసుకువెళ్తుండగా కలువాయి, గోనుపల్లి సెక్షన్ల అటవీశాఖ సిబ్బంది కాపుకాచి పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను రాపూరుకు తరలించి కేసు నమోదుచేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరుపుతున్నట్లు రాపూరు అటవీశాఖ రేంజర్ రవీంద్రబాబు తెలిపారు.

అక్రమ విద్యుత్ వినియోగదారులపై కేసులు



విద్యుత్ మీటరును పరిశీలిస్తున్న విజిలెన్స్ ఏడీ పరిశుద్ధరావు

అనంతసాగరం మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిల, అనంతసాగరం, పడమటికంభపాడు గ్రామాల్లో సోమవారం డిస్కం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఏడీ పరిశుద్ధరావు, ఏఈలు కోటయ్య, సుదీర్, సిబ్బంది గృహాలు, వ్యాపార సముదాయాలు తనిఖీసి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఏడీ తెలిపారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

ఉదయగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు సుభద్ర నిర్వహించిన గ్రీవెన్స్‌డే కార్యక్రమానికి పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఈసందర్భంగా తహసీల్దారు వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఇకపై గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 700 తృప్తి క్యాంటీన్లు

- త్వరలో ప్రారంభించేందుకు ప్రణాళిక
- రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ


తృప్తి క్యాంటీన్ ముందు మెప్మా మహిళలతో మంత్రి నారాయణ

నెల్లూరు (హరనాథపురం), మే 5 (ఆంధ్రజ్యోతి) : పేద మహిళలకు చేయూతనిచ్చి వారిని పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 700 తృప్తి క్యాంటీన్లను త్వరలో ప్రారంభించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. సోమవారం నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండు సెంటర్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి తృప్తి క్యాంటీన్‌ను ఆ శాఖ ఎండీ తేజ్‌భరత్‌తో కలిసి మంత్రి నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోనే తొలి తృప్తి క్యాంటీన్ నెల్లూరులో ప్రారంభించామని చెప్పారు. సారా ప్రాజెక్టు టైఅప్‌తో నలుగురు మెప్మా మహిళలతో ఈ క్యాంటీన్ ప్రారంభించినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 3వేల మంది మెప్మా మహిళలతో 700 క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, మెప్మా పీడీ రాధమ్మ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నాయకులు వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, అనురాధ, విజేతారెడ్డి పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మోదీ విఫలం

- ఎన్నికల్లో లబ్ధికోసమే యుద్ధ ప్రకటన
- 13న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల జిల్లాకు రాక
- డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), మే 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని, ఇందుకు ప్రధాని మోదీయే కారణమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి విమర్శించారు. నగరంలోని ఇందిరాభవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హిందుత్వ రాజకీయాలను మోదీ ప్రోత్సహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతికి ప్రధాని ఇచ్చిన లక్ష్యం నెరవేరదనే నమ్మకం తనకు ఉందన్నారు. కులగణనను మొట్టమొదట పార్లమెంట్‌లో లేవనెత్తింది రాహుల్‌గాంధీయేనని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో త్వరలో ఎన్నికలు ఉన్నాయని, వాటిలో లబ్ధి పొందేందుకు పాకిస్తాన్‌తో ప్రధాని యుద్ధమని ప్రకటన చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాగా ఈనెల 13న పీసీసీ అధ్యక్షురాలు జిల్లా పర్యటనకు వస్తున్నారని, త్వరలోనే షెడ్యూల్‌ను ప్రకటిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు ఉడతా వెంకట్రావు, శ్రీనివాసులు రెడ్డి, బాలసుధాకర్, మోహన్‌రావు, ఫయాజ్, ఫజల్ పాల్గొన్నారు.



ఊపిరి తీసుకోనివ్వదు!

మానవులు జీవించడానికి అవసరమైన ప్రాణవాయువును తీసుకోవడానికి సహకరించే అవయవాలు శ్వాస నాళాలు, ఊపిరితిత్తులు. అలాంటి వాటిని కబళించి ఊపిరి ఆడనివ్వకుండా చేసేది ఆస్తమా వ్యాధి. ఇది ఒక్కొక్కప్పుడు ప్రాణాపాయ స్థితికి దారి తీస్తుంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా రెండు దశాబ్దాలుగా జిల్లాలో ఆస్తమా వ్యాధిగ్రస్తుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం జిల్లాలో 2.60 లక్షల మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఇందులో చిన్నారులే 70 వేల మందికిపైగా ఉండటం గమనార్హం. కరోనా కారణంగా ఎంతో మందికి ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గిందని, తాజాగా లంగ్స్ అటాక్ కూడా వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థకు అనుబంధంగా గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఆస్తమా(జినా) సంస్థ ఈ వ్యాధిని నియంత్రించాలని పిలుపునిచ్చింది.

- విస్తరిస్తున్న ఆస్తమా వ్యాధి
- జిల్లాలో 2.60 లక్షల మంది వ్యాధిగ్రస్థులు
- చిన్నారుల్లోనూ బాధితులు
- ప్రతి ఏటా వెయ్యి మంది మృత్యువాత
- నేడు ప్రపంచ ఆస్తమా నివారణ దినం

నెల్లూరు (వైద్యం), మే 5 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న పట్టణీకరణ, వాతావరణ కాలుష్యం కారణంగా ఆస్తమా వ్యాధిగ్రస్తులు ఎక్కువవుతున్నారు. ఉన్నట్టుండి శ్వాస తీసుకోవడం కష్టంగా మారడం, ఆయాసం, పిల్లికూతలు. దగ్గు, ఛాతీలో నొప్పి వంటివి ఆస్తమా వ్యాధికి దారితీస్తాయి. జిల్లాలో పరిశ్రమలు విస్తరించడం, వాహనాల సంఖ్య పెరగడంతో వాయు కాలుష్యం ఎక్కువైంది. దీనికితోడు విపరీతమైన ఉష్ణోగ్రతలు, వేడి వాతావరణంతో దూళి కణాలు ఎక్కువగా గాలిలో కలిసిపోతున్నాయి. వాటిని పీల్చడం వల్ల కూడా ఆస్తమాకు గురవుతున్నారు. ఇళ్లలోనూ పరిశుభ్రత చాలా అవసరం. బూజు, దుమ్ము, దూళి లేకుండా చూసుకోవడం, దిండ్లు, పరుపులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం, జంక్ ఫుడ్ జోలికి పోకుండా తాజా ఆకుకూరలు, కాయగాయలు తీసుకోవడం ద్వారా ఆస్తమా నుంచి కాపాడుకోవచ్చు. అవగాహనలేమి, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి కారణాలతో ఏటా సుమారు వెయ్యి మంది వరకు ఆస్తమాతో మరణిస్తున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. జిల్లాలోని చిన్నారుల్లో 5 శాతం మందిపై ఆస్తమా ప్రభావం ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. యువకుల్లో పది శాతం మేర అలర్జీ ఆస్తమాలకు గురవుతున్నారని, మధ్య వయస్కుల్లో 15 శాతం ఈ వ్యాధిబారిన పడుతున్నట్లు సమాచారం. భవిష్యత్తులో ఆస్తమా వ్యాధిగ్రస్తులు మరింత పెరిగే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలని వైద్యవర్గాలు హెచ్చరిస్తున్నాయి.

ఆధునిక వైద్య విధానాలు

ప్రాథమిక స్థాయిలోనే ఆస్తమాను గుర్తిస్తే త్వరగా నయం చేయవచ్చు. వ్యాధి ముదిరితే దీర్ఘకాలిక చికిత్స అవసరం. గతంలో వ్యాధి నివారణ కోసం ట్యాబ్లెట్లు, దీని వల్ల కొన్ని దుష్పరిణామాలు కూడా చోటు చేసుకునేవి. చేతులు, కాళ్ల వణకడం, షుగర్, బీపీ వంటి సమస్యలు ఎదురయ్యేవి. ఆ తర్వాత ఆధునిక పీల్చే మందులు (ఇన్‌హేలర్స్) అందుబాటులోకి వచ్చాయి. వీటిని స్వల్పకాలిక, దీర్ఘకాలిక తరహాలో వాడుతున్నారు.

వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు



ఆస్తమా వ్యాధిపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాంతకంగా మారుతుంది. ప్రాథమిక దశలోనే వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్సలు అందిస్తే ఉపశమనం పొందవచ్చు. కాలుష్యానికి వీలైనంత దూరంగా ఉండాలి. ఒక్కోసారి దీనికి దీర్ఘకాలికంగా కూడా చికిత్స పొందాల్సి ఉంటుంది. ఒక్కోసారి సీవోపీడీకి దారితీసి ప్రాణాలు పోవచ్చు. 6 నుంచి 12 ఏళ్ల చిన్నారులే ఎక్కువగా ఆస్తమాకు గురవుతున్నారు. వాతావరణ కాలుష్యమే ఇందుకు ప్రధాన కారణం.

\- డాక్టర్ జీ అరుణ, జీజీహెచ్ పల్మనాలజీ హెచ్‌వోడీ, ఆస్తమా వైద్య నిపుణులు

అవగాహన అవసరం



ఆస్తమా వ్యాధిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అందుకే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్తమా కూడా ఈ వ్యాధి నుంచి రోగులకు రక్షణ కల్పించండంటూ పిలుపునిచ్చింది. పీఎఫ్‌టీ (పల్మనలరీ ఫంక్షన్ టెస్ట్) ద్వారా వ్యాధి స్థాయిని గుర్తిస్తారు. తదనుగుణంగా చికిత్సలు అందచేయటం జరుగుతుంది. వాయు కాలుష్యం, అలవాట్లే ఈ వ్యాధికి ముఖ్య కారణం ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, కుటుంబ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది.

\- డాక్టర్ పోకల రవి, డెల్టా చెస్ట్ ఆసుపత్రి

మాజీ మంత్రి అనిల్ అరెస్టు అవుతారేమో!?

- అందుకే నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు!
- ఎంపీ వేమిరెడ్డి పరిశ్రమ పెడితే తప్పేంటి?
- మీడియాతో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర


మాట్లాడుతున్న రవిచంద్ర పక్కన కోటంరెడ్డి, గిరిధర్‌రెడ్డి

నెల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : 'వైసీపీ హయాంలో ఇరిగేషన్ శాఖలో జరిగిన అక్రమాలు, మైనింగ్ దోపిడీపై విచారణ తుదిదశకు చేరుకుంది. దీంతో త్వరలోనే తనను అరెస్టు చేస్తారన్న అనుమానం మాజీ మంత్రి అనీల్‌కు కలిగినట్లు ఉంది. అందుకే ఆయన నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారేమోనన్న అనుమానం కలుగుతోంది' అని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర వ్యాఖ్యానించారు. జిల్లాలో ఎక్కడా ఇల్లీగల్ మైనింగ్ జరగడం లేదని స్పష్టం చేశారు. సోమవారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బీద మాట్లాడారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పరిశ్రమ పెడితే తప్పేమిటని రవిచంద్ర ప్రశ్నించారు. 50 ఏళ్ల క్రితం నుంచే వేమిరెడ్డి కుటుంబం మైనింగ్ వ్యాపారంలో ఉందని గుర్తు చేశారు. వేమిరెడ్డి తండ్రి నుంచి వైఎస్ రాజారెడ్డి కూడా ఒక మైన్ కొనుగోలు చేసి వ్యాపారం చేసుకున్నారని చెప్పారు. సోలార్ ప్యానల్స్, సోలార్ ట్యూబ్స్ తయారీకి అవసరమైన ముడి పదార్థం కోసమే వీపీఆర్ కంపెనీ స్థాపించారని వివరించారు. దీని ఫలితంగా చైనా నుంచి దిగుమతులు చేసుకునే అవసరం తప్పుతుందని చెప్పారు. దేశాభివృద్ధిలో భాగంగా వీపీఆర్ పరిశ్రమ పెడుతుంటే అనీల్‌కు వచ్చిన బాధేమిటని బీద ప్రశ్నించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి అక్రమ మైనింగ్ చేయలేదని జగన్మోహన్‌రెడ్డి నుంచి అనిల్ వరకూ ఎవరైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రుస్తుం మైన్స్‌లో ఎటువంటి దోపిడీ జరిగిందో అందరికీ తెలుసునన్నారు. ఇక్కడ జరిగిన విచారణలో అక్రమ తవ్వకాలు జరిగాయని తేలింది కాబట్టే మాజీ మంత్రి కాకాణిపై కేసు పెట్టారని చెప్పారు. మరి తప్పు చేయకపోతే కాకాణి ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. కాకాణి అక్రమాలు నిరూపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎదుర్కొనేందుకు కాకాణి, అనిల్‌కుమార్ అందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

కావలి రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం ఉదయం కావలి పట్టణం ముసునూరు సమీపంలోని చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. కావలి మండలం గౌరవరంకు చెందిన వింతా శివకుమార్‌రెడ్డి సొంత పనిపై తన మోటారుసైకిల్‌పై అదే గ్రామానికి చెందిన వినుకొండ శ్రీనివాసులు(50)ను ఎక్కించుకుని ముసునూరుకు బయలుదేరాడు. మార్గమధ్యలో బ్లూమూన్ దాబా సమీపంలో వెనుకవైపు అతివేగంగా వచ్చిన కారు మోటారుసైకిల్‌ను ఢీకొంది. దీంతో మోటారుసైకిల్‌పై వెనుక కూర్చుని ఉన్న శ్రీనివాసులు ఎగిరి రోడ్డుపై పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మోటారుసైకిల్ నడుపుతున్న శివకుమార్‌రెడ్డికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ తిరుమలరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య సుగుణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కావలి రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, వివాహం కాలేదన్న మనస్తాపంతో ఉరి వేసుకుని పొందూరు విష్ణువర్ధన్‌రావు(42) ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం కావలి పట్టణం ముసునూరు రాంనగర్‌లో జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. పొందూరు విజయమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. రెండవ కుమారుడు విష్ణువర్ధన్‌రావు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విజయమ్మకు రెండు నెలల క్రితం కంటి ఆపరేషన్ చెయ్యగా రెండు రోజుల క్రితం జలదంకి మండలం కర్కోరివారిపాలెంలో ఉంటున్న కుమార్తె శ్రీదేవి వద్దకు వెళ్లింది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో కుమారుడికి ఫోన్ చెయ్యగా ఇంటివద్ద ఉన్నట్లు తెలిపాడు. సోమవారం ఉదయం మళ్లీ ఫోన్ చెయ్యగా ఎంతకు తియ్యకపోవడంతో తన మనవడితో కలసి ముసునూరులోని ఇంటికి వచ్చింది. తలుపునకు లోపల గడిపెట్టి ఉండటంతో పాటు తలుపు తియ్యకపోవటంతో కిటికీలో నుంచి చూడగా కర్టన్‌తో ఫ్యానుకు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో ఆమె కేకలు వెయ్యడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగలగొట్టి అతనిని కిందకు దించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. తల్లి విజయమ్మ ఫిర్యాదుతో ఎస్‌ఐ తిరుమలరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు

వెంకటాచలం, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో జరుగుతున్న జాతీయ అఖిల భారత అంతర యూనివర్సిటీల సాఫ్ట్‌బాల్ పురుషుల టోర్నమెంట్ పోటీలు రెండోరోజు హోరాహోరీగా సాగింది. ఉదయం 6.30 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ పోటీలను నిర్వహించారు. పోటీలో 33 మ్యాచ్‌లు జరగగా 17 జట్లు విజయం సాధించాయి. వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత పోటీలను పర్యవేక్షించారు.

తెల్లరాయి తరలింపుపై కేసు

సైదాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా ఓ యార్డ్ నుంచి అక్రమంగా తెల్లరాయి (క్వార్ట్జ్) తరలింపుపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. చాగణం గ్రామంలోని పూజిత మినరల్స్ యార్డ్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండా తెల్లరాయి (క్వార్ట్జ్)ని అక్రమంగా తరలించేందుకు క్రేన్ ద్వారా లారీకి లోడు చేస్తున్న సమయంలో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో లారీ, క్రేన్, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కాంతికుమార్ తెలిపారు.

కారు డ్రైవర్ అనుమానాస్పద మృతి


మునాఫ్ మృతదేహం

నెల్లూరు(క్రైం), మే 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా కారుడ్రైవర్ మృతిచెందగా సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు నగరంలోని జ్యోతి నగర్‌కి చెందిన పీ. మునాఫ్(35), సర్తాజ్ దంపతులు. వారికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. మునాఫ్ ఎక్సైజ్ శాఖలో ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో సర్తాజ్ కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మునాఫ్ తన తమ్ముళ్ల వద్ద ఉంటున్నాడు. మద్యానికి బానిసైన ఆయన ఈనెల 4న డ్యూటీ లేకపోవడంతో ఉదయం నుంచి మద్యం సేవిస్తూ ఉన్నాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసి బయటకు వెళ్లి మళ్లీ మద్యం సేవించసాగాడు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఆటోనగర్ ఫేస్-1లోని ఓ టింకరింగ్ దుకాణానికి సమీపంలో ఆగి ఉన్న ఆటోలో మునాఫ్ పడి ఉండడాన్ని సందాని అనే వ్యక్తి గమనించాడు. వెంటనే మునాఫ్ సోదరుడు ఇమ్రాన్‌కు తెలియజేశాడు. ఆయన వెంటనే తన బంధువు ఇలియాజ్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని తన అన్నను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ మేరకు ఇమ్రాన్ వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం వైద్యులు పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మునాఫ్ ఫుల్లుగా మద్యం సేవించి ఊపిరాడక మృతి చెందాడా.. లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా...? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

పీజీఆర్ఎస్‌కు అర్జీల వెల్లువ

- మొత్తం వినతులు 345 కాగా అందులో రెవెన్యూవే 133


అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం) మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రానురాను రెవెన్యూ సమస్యలపై అర్జీలు పెరిగిపోతున్నాయి. మండల, జిల్లా స్థాయిలో రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీంతో అర్జీదారులు కలెక్టరేట్‌కు పోటెత్తుతున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 345 అర్జీలు రాగా, వాటిలో రెవెన్యూ శాఖవి 133 ఉండడం విశేషం.

సత్వరమే పరిష్కరించాలి

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, డీపీవో శ్రీధర్ రెడ్డి, జడ్పీ సీఈవో విద్యారమ, డ్వామా పీడీ గంగా భవానీ, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు.

- రోజురోజుకి ఆకాశాన్ని అంటుతున్న ధరలు , పెరుగుతున్న అవసరాలు, తరుగుతున్న ఆర్థిక వనరుల దృష్ట్యా రోజువారీ కార్మికులకు కనీస నెల వేతనం రూ.35వేలు చేయాలని, తక్షణమే కనీస వేతనాల బోర్డును నియమించాలని ఏఐటీయూసీ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.
- పొలంలో బోరు వేసేందుకు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అడ్డుకుంటున్నాడని, అతడిపై చర్యలు తీసుకుని బోరు వేసుకునే అవకాశం కల్పించాలని ఆత్మకూరు మండలం మహిమలూరు తూర్పు దళితవాడకు చెందిన బోయల చెన్నయ్య కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.
- నెల్లూరు బర్మాషెల్‌గుంట రైల్వే స్థలాల్లో నివాసం ఉన్న వారికి నెల సమయం ఇచ్చి ఖాళీ చేయించాలని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
- పొదలకూరులోని సత్యనారాయణ ట్రేడర్స్ లే అవుట్‌లోని 286 అంకణాల స్థలంలో పార్కును అభివృద్ధి చేయాలని లేఅవుట్‌వాసులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రేడర్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఛైర్మన్ అరుణ, మల్లికార్జున్‌నాయుడు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


డీఆర్వోకి విన్నవిస్తున్న విద్యార్థి సంఘం ప్రతినిధులు

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్ కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న అనధికార అడ్మిషన్లపై సోమవారం కలెక్టరేట్‌లో డీ ఆర్‌ఓకు ఉదయ్‌భాస్కర్‌రావుకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పవన్‌కిషోర్, నేతలు సుధీర్, సిద్దు, మౌళి తదితరులు పాల్గొన్నారు.

- ప్రైవేట్ పాఠశాలల్లో దోపిడీ అరికట్టాలి

ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న దోపిడీని అరికట్టాలని పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ నేతలు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో పీఏఏపీ అధ్యక్షుడు నరహరి, ఉపాధ్యక్షుడు లీలా మోహన్, నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి : ఎస్పీ

నెల్లూరు(క్రైం), మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్పీ జీ. కృష్ణకాంత్ ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరిగింది. జిల్లావ్యాప్తంగా 101 మంది ఫిర్యాదుదారులు వారి సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ఎస్పీ ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

- ప్రేమించుకుని కులాంతర వివాహం చేసుకున్నాం. మా కుటుంబసభ్యుల నుంచి మాకు రక్షణ కల్పించాలని ఇందుకూరుపేట మండలం కొత్తూరు పాములవారిపాలెం గ్రామానికి చెందిన ఎస్‌కె రేష్మ అనే యువతి ఫిర్యాదు చేశారు.
- బెంగళూరుకి చెందిన ఓ సంస్థ అధికారులమంటూ నగరంలోని ఓ వ్యక్తికి ఐజాక్, నిశాంత్‌లు పరిచయమయ్యారు. ఇళ్లలో సోలార్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తామని చెప్పడంతో బాధితుడు తనకు తెలిసిన నెల్లూరు, ప్రకాశం జిల్లాల వారి నుంచి రూ.60 లక్షలు వసూలు చేసి వారికి పంపాడు. ప్రాజెక్టు ఏర్పాటు చేయకపోగా నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేశాడు. విచారించి న్యాయం చేయాలని కోరాడు.
- ఇందుకూరుపేటకి చెందిన ఓ వ్యక్తి కొంతమందితో కలిసి తన తండ్రిని 2020లో హత్య చేసినట్లు కోర్టులో కేసు విచారణకు వచ్చింది. ముద్దాయిలు, అతడి కుటుంబ సభ్యులు కేసు రాజీ చేసుకోవాలని బెదిరిస్తున్నారని బాధితుడు ఫిర్యాదు చేశారు. తన పొలాల వద్దకు వచ్చి ఇబ్బందులు పెడుతున్నా రని, రక్షణ కల్పించాలని కోరారు.


అర్జీదారుతో ఎస్పీ కృష్ణకాంత్

- జర్నలిస్టులపై కేసు ఎత్తివేయాలి

కావలి రెండోపట్టణ పోలీసులు జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని జర్నలిస్టు సంఘాల ఐక్యవేదిక నాయకులు ఎస్పీ జీ. కృష్ణకాంత్‌ను కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఐక్యవేదిక నాయకులతోపాటు పలువురు జర్నలిస్టులు సోమవారం ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నేతలు ఏ. జయప్రకాష్, సీహెచ్ మస్తాన్‌రెడ్డి, పీ. బాలకృష్ణ, మునీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100) : 500

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9,154
వెండి కిలో ధర	రూ. 96,900
వెండి ఒక గ్రాము	రూ.99.90

18 గ్రామాల్లో నిరంతర త్రీఫేజ్ విద్యుత్

నెల్లూరురూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ మండలంలోని 18 గ్రామాల్లో ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా రూ.24కోట్లతో 24 గంటలూ త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అయ్యేలా కృషి చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దేవరపాళెంలో రూ.1.80 కోట్లతో ఏర్పాటు చేసిన త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను సోమవారం స్విచ్ఛాన్ చేసి ప్రారంభించారు. పల్లెలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో వేదగిరి క్షేత్రం మాజీ ఛైర్మన్లు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, డీఈ ప్రభాకర్, ఏఈ కుమార్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సేఫ్టీ అధికారుల పర్యవేక్షణలో హెడ్ రెగ్యులేటర్ నిర్మించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల అదనపు హెడ్ రెగ్యులేటర్‌ను నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారుల పర్యవేక్షణలో నిర్మించాలని బీజేపీ నమామీ గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సోమశిల ప్రాజెక్ట్ పర్యవేక్షణ అధికారి వెంకటరమణారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు.హెడ్ రెగ్యులేటర్ నిర్మాణ విధానం ఖరారు కాకుండానే వరద కాలువ విస్తరణకు రూ.వందల కోట్లు ఖర్చు చేశారని గుర్తుచేశారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారుల నివేదికను అనుసరిస్తూ నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోట్లూరు శ్రీనివాసులు, నరాల సుబ్బారెడ్డి, రఘురామయ్య, రత్నం నాయుడు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర యోగాలో జిల్లాకు పతకం

నెల్లూరు(విద్య), మే 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో యోగా కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో 65 ఏళ్ల పైబడిన విభాగం లో రఘురామయ్య రజిత పతకం సాధించా రని యోగా మాస్టర్ ప్రసన్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపి న రఘురామయ్య త్వరలో కోల్‌కతాలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేత్రదానం

నెల్లూరు (వైద్యం), మే 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జ్యోతినగర్‌కి చెందిన పటాన్ మునాఫ్ (35) సోమవారం మృతిచెందారు. ఆయన నేత్రాలను దానం చేసేందుకు చిరంజీవి ఐ బ్యాంక్ సంస్థ ఇన్‌చార్జ్ సుధీర్ సహకారంతో మృతుడి కుటుంబ సభ్యులు తమ సమ్మతి తెలిపారు. దీంతో ఎల్‌వి ప్రసాద్ ఐ ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ నేత్రాలను సేకరించారు. కుటుంబ సభ్యులు పటాన్, ఇమ్రాన్‌లకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందచేశారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు

నెల్లూరు (సాంస్కృతికం) మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం చిన్నారులకు వ్యక్తిత్వ వికాస తరగతులు, యోగా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, మోటివేటర్లు, సిబ్బంది పర్యవేక్షించారు.

కుట్టుమిషన్ శిక్షణ

మనుబోలు, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కార్యాలయం వద్ద ఉన్న పంచాయతీరాజ్ అతిథిగృహంలో మండల మహిళలకు సోమవారం కుట్టుమిషన్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షకురాలు కంద్రాతి మాధవి మాట్లాడారు. 120 మందికి రెండుదఫాలుగా 3నెలలు శిక్షణ ఇస్తామన్నారు. అవకాశాన్ని మండల మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం అధికారుల ఆదేశాల మేరకు మిషన్లు ఇస్తామన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

మనుబోలు, మే 5(ఆంజ్యోతి):జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో సోమవారం వేగ నియంత్రణ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివరాకేష్ మాట్లాడారు. హైవేపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే 5క్రాస్ రోడ్లను గుర్తించామన్నారు. మనుబోలు, వీరంపల్లి, కాగితాలపూరు, బద్దెవోలు, కొండూరు సత్రం రోడ్ల వద్ద బోర్డులు పెట్టామని, ప్రయాణికులు గుర్తించుకుని, క్రాస్‌రోడ్డుల వద్ద వేగాన్ని నియంత్రించి ప్ర యాణించాలని కోరారు.

కోదండరాముడి కల్యాణం

విడవలూరు, మే 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని చౌకిచర్ల గిరిజనకాలనీలో వెలసిన కోదండరామస్వామి కల్యాణంను సోమ వారం భక్తులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, ఓగు నాగేశ్వరరావు, సమాధి శ్రీనివాసులు, కొల్లు వెంకయ్య, గర్తేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. నిర్వాహకులు పోట్లూరు సుధాకర్‌లు వివిధప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

కోడిపందెం స్థావరంపై దాడి

వెంకటాచలం, మే 5(ఆంధ్రజ్యోతి): కసుమూరు సమీపంలో జరుగుతున్న కోడిపందెం స్థావరంపై సోమవారం సాయంత్రం వెంకటాచలం సీఐ సుబ్బారావు, ఎస్ఐ అంజనేయులు సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఇద్దరు పందెం రాయుళ్లను అదుపులోకి , 15బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఆర్థిక సాయం

రాపూరు, మే 5 (ఆంధ్రజ్యోతి):బొజ్జన పల్లి పంచాయతీ రావిగుంటపల్లిలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతి చెందిన తాటిబోయిన చిన్నయ్య కుటుంబానికి స్థానిక ముదిరాజ్ సంఘం నేతలు రూ. 14వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు మనుబోలు శివప్రసాద్, చంద్ర, అంకయ్య, జయసంహ, మరిపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గాంధీ జయంతి నాటికి 'స్వచ్ఛాంధ్ర'

పురపాలకశాఖ మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), మే 5(ఆంధ్రజ్యోతి): వచ్చే గాంధీ జయంతి నాటికి స్వచ్ఛాంధ్రను సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. సోమవారం ఎన్ఎంసీ అధికారులతో కలిసి అల్లీపురం వద్దనున్న డంపింగ్ యార్డులో బయోమైనింగ్ రీసైక్లింగ్ యూనిట్‌ను పరిశీలించారు. అక్కడ జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ పొల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో రీసైక్లింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ డంపింగ్ యార్డులో 30 వేల టన్నుల చెత్త ఉందన్నారు. ఇప్పటికే ఐదు వేల టన్నుల చెత్తను రీసైకిలింగ్ ద్వారా బయటకు పంపామని చెప్పారు. దొంతాలి యార్డులోనూ 3 లక్షల టన్నుల చెత్త ఉందన్నారు. అనంతరం రంగనాయకులపేట వద్దనున్న తిక్కన పార్కులో ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 123 మున్సిపాలిటీల్లో పార్కుల అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. కాగా నగరంలోని 5, 51,52 డివిజన్లలోని ఇళ్లను రైల్వే అధికారులు తొలగిస్తారంటూ వచ్చిన పుకార్లు వాస్తవం కాదని ఆయన స్పష్టం చేశారు. ఇళ్లు తొలగించాల్సి వస్తే బాధిత కుటుంబాలవారికి ప్రత్యామ్నాయం చూపాకే నిర్ణయం తీసుకోవాలని ఫోన్లో కలెక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమాల్లో నగర కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, అనురాధ, విజేతారెడ్డి, మధు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

● పేదలకు అన్యాయం చేయరు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి) : మంత్రి పొంగూరు నారాయణ తన నియోజకవర్గంలోనేకాదు రాష్ట్రంలోని ఏ నియోజకవర్గంలో కూడా పేదలకు అన్యాయం చేయరని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తెలిపారు. నగర పరిధిలోని పాత చెక్‌పోస్ట్, బర్మా షెల్‌గుంట, రైలుకట్ట వీధి తదితర ప్రాంతాల్లోని ప్రజలను సోమవారం ఆయన కలిశారు. రైల్వే స్థలాల నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వైసీపీ నాయకులు రాజకీయ లబ్ధికోసం వక్రీకరి స్తున్నారని, కేంద్ర రైల్వే స్థలాలు ఎప్పటికైనా ఖాళీ చేయాల్సిందేనన్న విషయం వారికీ తెలుస న్నారు. ప్రత్యామ్నాయంగా టిడ్కో ఇళ్లు ఇచ్చిన తర్వాతే, ఇక్కడ నుంచి ప్రజలను కదిలిస్తారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు విజయలక్ష్మి, ప్రశాంత్‌గౌడ్, హేమచంద్ర యాదవ్, యాసిన్, శాంభవి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డికి సీఎం అభినందనలు



నెల్లూరు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 339 అభివృద్ధి పనులను కేవలం 60 రోజుల్లో పూర్తి చేయడంపై రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. సోమవారం ఉండవల్లి నివాసంలో సీఎంని కలిసిన శ్రీధర్‌రెడ్డి.. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలతో రూపొందించిన పుస్తకాన్ని అందజేశారు. అనంతరం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కలిసి శ్రీధర్ రెడ్డి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు.

సీహెచ్‌వోలపై మంత్రి ఆగ్రహం సరికాదు

● అసోసియేషన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు

నెల్లూరు (వైద్యం), మే 5 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ అధికారులు ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరితే, మంత్రి సత్యకుమార్ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేయడం సరికాదని ఏపీ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్, ప్రధాన కార్యదర్శి కృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సీహెచ్‌వోలు చేస్తున్న సమ్మె సోమవారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలపై వెంటనే సానుకూలంగా చర్చించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అదిత్, సంయుక్త కార్యదర్శి రెబికా, సుమాంజలి పాల్గొన్నారు.

రూ.2.96కోట్లతో బుజబుజనెల్లూరులో అభివృద్ధి

నెల్లూరు(విద్య), మే 5 (ఆంధ్రజ్యోతి) :బుజబుజ నెల్లూరులో రూ.2.96 కోట్లతో అభి వృద్ధి పనులు వేగవంతం గా జరుగుతున్నాయని కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి అన్నారు. సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే, ఒకేసారి 37 పనులకు ఆమోదం తెలిపారన్నారు. దీంతో రూ.2.96 కోట్ల నిధులతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలను చేపట్టి వేగవంతంగా పూర్తి చేశామన్నారు. పూర్తయిన పనులన్నింటినీ ఈ నెలలో ప్రారంభించి ప్రజలకు అందిస్తామని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు జెన్ని రమణయ్య, బోనుబోయిన ఆదిశేషయ్య, హరినాయుడు, రాజా, అశోక్, షబ్బీర్, కరిముల్లా పాల్గొన్నారు.

గత ఐదేళ్లలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

నెల్లూరు (వైద్యం) మే 5 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లలో నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయిందని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం 47వ డివిజన్‌లోని ములుముడి బస్టాండ్ ప్రాంతంలో పూడికతీత కార్యక్రమం చేపట్టారు. టీడీపీ నాయకులు కాలువల్లోని మట్టిని తొలగించారు. కార్యక్రమంలో డాక్టర్ గణేష్‌కుమార్, ఫిరోజ్, మునికృష్ణ, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

మెట్టు రామచంద్ర ప్రసాద్‌కి నివాళి

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : పద్య కళాపరిషత్ అధ్యక్షుడు, వీఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు మెట్టు రామచంద్రప్రసాద్ సంతాపసభను పద్య కళాపరిషత్, పద్యసారస్వత పరిషత్ సంయుక్తంగా సోమవారం రాత్రి వర్ధమాన సమాజంలో నిర్వహించాయి. బలరామయ్యనాయుడు, జయప్రకాష్, అన్నపూర్ణ, సుభద్రాదేవి, సాయికుమార్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

'కిశోరి వికాసం' క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు (హరనాధపురం) : కిశోరి వికాసం క్యాలెండర్-2025ను కలెక్టర్ ఓ ఆనంద్ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ, బాలల సంరక్షణ అధికారి సురేష్, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేషన్ ఎస్‌కే.షహనాజ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలి



ధర్నా సందర్భంగా నినాదాలిస్తున్న కార్మికులు

నెల్లూరు(సిటీ), మే 5,(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌లోని పారిశుధ్య కార్మికులను పదవీ విరమణ ప్రయోజనాలను కల్పించాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఎన్ఎంసీ కార్యాలయం ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన వారిని విధుల నుంచి తొలగిస్తున్నారని తెలిపారు. వారందరికీ పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలన్నారు. వారి కుటుంబాలలోని వారసులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. మరో రెండు రోజులు నిరసన కార్యక్రమాలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో కొండ ప్రసాద్, సుధాకర్, మాలకొండయ్య పాల్గొన్నారు.

పహల్గాం మృతుల ఆత్మశాంతికి దువా

నెల్లూరు (సాంస్కృతికం) మే 5 (ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో ఉగ్రదాడికి వ్యతిరేకంగా సోమవారం బారాషహీద్ దర్గా వద్ద సయ్యద్ కార్యక్రమం జరిగింది. ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మశాంతి కోసం దర్గాలో దువా చేశారు. అనంతరం పాక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మృతుల ఆత్మశాంతి కోసం బెలూన్లు ఎగురవేశారు.



పహల్గాం మృతుల ఆత్మశాంతికి బెలూన్లు ఎగురవేస్తున్న ముస్లింలు

● పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా బీజేపీ నాయకులు గుప్తాపార్క్ సెంటర్‌లో పాకిస్తాన్ జెండాను, ఉగ్రవాదుల చిత్రపటాలను సోమవారం రోడ్డుపై అతికించారు. అటుగా వెళుతున్న వాహనదారులు, ప్రజలు వాటిని కాళ్లతో తొక్కుకుంటూ వెళ్లారు. అనంతరం వాటిని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్ సింగ్, హేమంత్, సుందరం, పెంచలయ్య, మాల్యాద్రి, ఏ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో పీజీఆర్ఎస్‌కు 54 వినతులు

నెల్లూరు(సిటీ), మే 5,(ఆంధ్రజ్యోతి) : నగర కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి 54 వినతులు అందాయి. డీసీ చెన్నుడు వాటిని స్వీకరించి పరిష్కరించాలని ఆయా విభాగాల అధిపతులను ఆదేశించారు. ప్రతి అర్జీని క్షేత్ర స్థాయిలో పరిశీలించి వీలైనంత వరకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. పాలనపరంగా 4 , రోడ్లు, డ్రైన్ల సమస్యలపై 8, ఇళ్ల సమస్యతో 22, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగానికి 6, సిటీప్లానింగ్‌కి 13, పింఛన్ కోసం ఒకటి వినతిపత్రం అందినట్లు ఆయన వెల్లడించారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), మే 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. నగరంలోని సంతపేట నాలుగుకాళ్ల మండపం వద్ద ఈ నెల ఒకటిన గుర్తుతెలియని వ్యక్తి(60) స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్ సాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. సమాచారం అందుకున్న సంతపేట పోలీసులు సోమవారం వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వం హరిహరమూర్తి అలంకారం

నెల్లూరు (సాంస్కృతికం), మే 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి ఖడ్గమాల పూజలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, విశేషపూజలు జరిగాయి. స్వామి వారు హరిహరమూర్తి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారితో కలిసి ప్రాకారోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.

జువేరియాకు కలెక్టర్ అభినందన

నెల్లూరు (హరనాథపురం,ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవలాకుల గార్డెన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతి ఫలితాల్లో 594 మార్కులతో సత్తా చాటిన విద్యార్థిని మహమ్మద్ జువేరియాను కలెక్టర్ ఆనంద్ సత్కరించి అభినందించారు. తల్లిదండ్రులతో కలిసి జువేరియా సోమవారం కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు.

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సహకారం మరువలేనిది

● వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు



వెంకటాచలం, మే5 (ఆంధ్రజ్యోతి):విక్రమ సింహపురి యూనివర్సిటీలో జరిగిన జాతీయ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ విజయవంతం అయ్యేందుకు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అందించిన సహకారం మరువలేనిది అని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు కొనియాడారు. మండలంలోని వీఎస్‌యూలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. వీఎస్‌యూలో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నీ విజయవంతంగా కొనసాగుతుందన్నారు. టోర్నీని సజావుగా నిర్వహించేందుకు క్వాలిఫైడ్ రెఫరీలు, అంపైర్లు ఏర్పాటులో సహకరించిన జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, ఉపాధ్యక్షుడు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సెక్రటరీ సీహెచ్ కామేశ్వరిలకు వీఎస్‌యూ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గ్రీవెన్స్‌కి నలుగురు అధికారుల హాజరు

ముత్తుకూరు, మే 5 (ఆంధ్రజ్యోతి):ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమాన్ని మొక్కుబడిగా సాగుతోంది. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ గ్రీవెన్స్‌కు డిప్యూటీ తహసీల్దారు ప్రదీప్, ఎంపీడీవో ఏవో భాస్కర్, హౌసింగ్ ఏఈ మృత్యుంజయ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాత్రమే వచ్చారు. వారు కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహించి చేతులు దు లుపుకున్నారు.

కాలనీల్లో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, మే 5, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పీఆర్ ఆర్ కాలనీలోని 4,5,6 వార్డుల్లో పర్యటించారు. రోడ్లు, చవిటి కాలువల సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. 15వ ఆర్థిక సంఘం సంఘ నిధులతో కాలనీ లన్నింటినీ అభివృద్ధి చేస్తామ న్నారు. త్వరలోనే తాలుకా ఆఫీసు కూడలిలో అన్న క్యాంటిన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచు విజయ, ఎంపీపీ పార్వతి, పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపా లరెడ్డి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

వెంకటాచలం, మే 5 (ఆంధ్రజ్యోతి):చవటపాళెం పంచాయతీ ఎర్రగుంటలో సోమవారం విద్యుదాఘాతానికి గురై కసుమూరు షేక్‌బాబు (49) మరణించాడు. గ్రామంలోని ఓ ఇంటి స్లాబ్‌కు సెంట్రింగ్ పనిచేస్తూ విద్యుత్ మెయిన్‌లైన్ తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానికులు, తోటికార్మికులు చికిత్స నిమిత్తం అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే బాబు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి

● నెల్లూరు ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో వినతి

● కార్యదర్శికి సస్పెండ్ ఆదేశాలిచ్చామన్న కలెక్టర్

పొదలకూరు, మే 5(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని సత్యనారాయణ లేఅవుట్‌లో రూ.3కోట్ల విలువైన పబ్లిక్ ప్రాపర్టీ స్థలంలోని 286అంకణాలను అక్రమార్కులపరం కాకుండా చూడాలని సోమవారం నెల్లూరులోని ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదికలో స్థానికులు కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారితో మాట్లాడారు. పొదలకూరులో ఏం జరుగుతుందో తనకంతా తెలుసునని మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తాను హైకోర్టుకు రిపోర్టు పంపానని అంతా మంచే జరుగుతుందని హామీ ఇచ్చారు. అంతేకాకుండా పొదలకూరు సత్యనారాయణ లేఅవుట్ విషయంలో పిటిషనర్లకు అనుకూలంగా వ్యవహరించి హైకోర్టుకు రెండు విధాలుగా నివేదికను అందజేసిన పంచాయతీ కార్యదర్శి ఒగ్గు శీనయ్య సస్పెన్షన్‌కు ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రలోభాలకులోనై పక్షపాతంగా వ్యవహరిస్తున్న కార్యదర్శి శీనయ్యపై సస్పెండ్ వేటు పడడంతో పొదలకూరు ప్రజలు హర్షం వ్యక్తం చూసి ప్రత్యేక చొరవపై అభినందిస్తున్నారు.



వినతిపత్రం ఇస్తున్న సత్యనారాయణ లేఅవుట్ వాసులు

ట్రాఫిక్‌రూల్స్‌ను ప్రతిఒక్కరూ పాటించాలి

● నెల్లూరు సౌత్ ట్రాఫిక్ ఎస్ఐ హరికృష్ణ

వెంకటాచలం, మే 5(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని నెల్లూరు సౌత్ ట్రాఫిక్ ఎస్ఐ హరికృష్ణ సూచించారు. చవటపాళెం పంచాయతీ సరస్వతీనగర్‌లోని అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదంగవే ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్‌సీసీ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు గుండాల నరేంద్రబాబు, మల్లికార్జున్‌రెడ్డి, మస్తానయ్య, కొండారెడ్డి, విద్యాసాగర్, అరోరా, సాయి శంకరి, దివ్య, సౌత్ ట్రాఫిక్ సిబ్బంది రమేష్, పెంచల ప్రసాద్ ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న సౌత్ ట్రాఫిక్ ఎస్ఐ హరికృష్ణ

అసంబద్ధ విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

పొదలకూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో గత ప్రభుత్వం అవలంబించిన విధానాలనే కొనసాగిస్తూ గందరగోళ పరిస్థితులను కల్పిస్తుందని ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు కాంతారావు, అధ్యక్షుడు మాల్యాద్రిరెడ్డిలు ఆరోపించారు. ఈ విషయంపై సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సంఘం సభ్యులతో కలిసి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలను 1 నుంచి 5తరగతుల్లో కొనసాగించాలని..ఉనికిలో ఉన్న 6నుంచి 10వ తరగతుల ఉన్నతపాఠశాలను యథాతథంగా కొనసాగించాలని డిమాండు చేశారు. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానించాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కనీసం 2ఎస్‌జీటీ పోస్టులను ఉండేలా చూడాలన్నారు. అనంతరం తహసీల్దారు శివకృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సునీల్‌కుమార్, శ్రీనివాసులు, చిన్నయ్య, రామ కృష్ణయ్య, సుబ్బయ్య, మహ్మద్, శ్రీహరి, పోలిరెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

చెన్నైకి నీరు విడుదల

రాపూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయం నుంచి తమిళనాడుకి 500 క్యూసెక్కులు తాగు నీటిని సోమవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విడుదల చేశారు. రాపూరు పెద్ద చెరువును రిజర్వాయర్ చేసేందుకు ప్రతిపాదనలు పంపుతున్నామని కురుగొండ్ల తెలిపారు. కార్యక్రమంలో తెలుగుగంగ ఎస్.ఈ ఎన్ రాధాకృష్ణ రెడ్డి, ఈఈలు విజయకుమార్‌రెడ్డి, రాధాకృష్ణమూర్తి, రామచంద్రమూర్తి, డిఈఈ ఎం రేవతి, ఏఈ కట్ట తిరుమలయ్య, ఏఈఈ అనిల్‌బాబు, వెంకటగిరి బీజేపీ సమన్వయకర్త సురేష్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు రెడ్డి, జల్లెల రాజేష్ పాల్గొన్నారు.

● మనుబోలు(ఆంధ్రజ్యోతి): సంగం రిజర్వాయర్ కాలువ ప్రధాన గేటు రెగ్యులేటర్‌కు సోమవారం కెనాల్ ఛైర్మన్, ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కనుపూరు కెనాల్ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు బిల్లుముడి సాయంతో కాలువ కిందకు 100క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో డిఈ. పాండురంగారెడ్డి, ఏఈలు వాసుదేవరావు, పెంచల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో సరుడు చోరీ

మనుబోలు, మే 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పిడూరురోడ్డులో సోమవారం చెన్ను రమణమ్మ అనే వృద్ధురాలి మెడలోంచి సరుడు, పగడాల దండ చోరీ అయ్యింది. వివరాలిలా ఉన్నాయి. చెన్ను రమణమ్మ దంపతులు దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్న సమయంలో భర్త నిద్రిస్తుండడంతో, ఆమె దుకాణంలో ఉన్నారు. ఇద్దరు యువకులు మోటార్‌సైకిల్‌పై వచ్చి నిలిచారు. అందులో ఓ యువకుడు మాస్క్ ధరించి మోటార్‌సైకిల్‌పై ఉండగా, మరో యువకుడు దిగి కూల్ డ్రింక్ కావాలని డబ్బు రమణమ్మకు ఇచ్చాడు. కూల్‌డ్రింక్ తెచ్చేందుకు లోపలికి తిరిగింది. వెంటనే యువకుడు వృద్ధురాలి మెడలోని మూడున్నర సవర్ల సరుడు, రెండు సవర్ల పగడాల దండ లాగేసి మోటార్‌సైకిల్‌పై ఉడాయించారు. రమణమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారంతా వెంబడించినా చేసినా ఫలితం లేకపోయింది. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దోషులను శిక్షించాలి

బుచ్చిరెడ్డిపాళెం, మే 5(ఆంధ్రజ్యోతి) :పోలినాయుడు చెరువు గ్రామానికి చెందిన రవీ హత్య కేసు దోషులను గుర్తించి శిక్షించాలని తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. ఈ విషయంపై సోమవారం ఆయన బుచ్చి వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ నుంచి వచ్చి పోలినాయుడు చెరువులో స్థిరపడిన వారు హత్యకు కారుకులని ఆరోపించారు. ఈ నెల 8న మాజీ సీఎంను కలిసి హత్య కేసు గురించి.. హత్యకు గురైన కుటుంబ ఆర్థిక పరిస్థితి వివరిస్తామ న్నారు. వారికి తాను ఆర్థికంగా ఆదుకుంటామన్నారు.

రేపు సత్యవేడుకు మంత్రి లోకేశ్

ఎల్లుండి ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు శంకుస్థాపన

తిరుపతి (కలెక్టరేట్), మే 5 (ఆంధ్రజ్యోతి): ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం తిరుపతి జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 3.40 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకునే ఆయన రోడ్డు మార్గాన 5.10 గంటలకు సత్యవేడులోని వీఎంకే కల్యాణ మండపం చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొని రాత్రికి అక్కడే బస చేస్తారు. గురువారం ఉదయం 10.50 గంటలకు శ్రీసిటీకి చేరుకుని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారని వెల్లడించారు. అనంతరం రోడ్డు మార్గాన 2.30 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని తిరుగుపయనం కానున్నట్లు కలెక్టర్ వివరించారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షకు 292మంది గైర్హాజరు

తిరుపతి(కలెక్టరేట్), మే 5 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్ రాత పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. సోమవారం 911 మంది అభ్యర్థులకు గాను 619 మంది హాజరయ్యారని, 292మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

తిరుపతి గంగ జాతరకు నేడు చాటింపు

విశ్వరూప స్థూపానికి అభిషేకం

ఊరేగింపుగా రానున్న అవిలాల పుట్టింటి సారె

తిరుపతి-ఆంధ్రజ్యోతి

తిరుపతి పొలిమేరలో మంగళవారం అర్ధరాత్రి వేసే చాటింపుతో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర సంబరం మొదలుకానుంది. దీనికి ముందు ఉదయం 7 గంటలకు గంగమ్మ ఆలయంలోని విశ్వరూప స్థూపానికి పరిమళ, పవిత్ర జలాలతో అభిషేకం చేసి వడిబాల కట్టడంతో జాతర ప్రాధాన్యత సంతరించుకుంటుంది. సాయంత్రం గంగమ్మ జన్మస్థలమైన రూరల్ మండలం అవిలాల నుంచి సారె వస్తుంది. సారెతో పాటు స్థానిక కైకాలవాళ్లు నగర పొలిమేర్లలో చాటింపు వేస్తారు. ఆలయ ప్రాంగణం విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా కనిపిస్తోంది.



విద్యుత్ దీప కాంతుల్లో గంగమ్మ ఆలయం



గర్భగుడి వద్ద పూల అలంకరణ

రోజుకో వేషం

వేలాది మంది భక్తులు చిత్ర, విచిత్ర వేషాలు ధరించి అమ్మవారిని దర్శించుకుంటారు. బుధవారం నుంచి వేషాల జాతర మొదలవుతుంది. తరాల తారతమ్యం భక్తి భావనకు అడ్డురాదని నిరూపిస్తూ వేషాలు వేయడానికి జనం పోటీపడతారు. 7వ తేదీ బైరాగి వేషంతో మొదలై బండవేషం, తోటి వేషం, దొరవేషం, మాతంగివేషం వరకు వేషాల జాతర సాగుతుంది. 12వ తేదీ సున్నపుకుండల వేషాలను ఇద్దరు కైకాల కులస్థులు వేస్తారు. వీరు చిన్న గంగమ్మ, పెద్ద గంగమ్మలకు ప్రతీకలుగా భక్తులచేత పూజలందుకుంటారు. 13వ తేదీ మంగళవారం అసలు జాతర సంబరం మొదలవుతుంది. ప్రత్యేక అభిషేకానంతరం వజ్రకిరీటంలో దర్శనమిచ్చే గంగమ్మను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో పోటెత్తుతారు. విశేషంగా పొంగళ్లు, జంతుబలులు ఉంటాయి. గంగమ్మ ఆలయం ముందు విశ్వరూప స్థూపానికి బంకమన్నుతో అమ్మవారి విశ్వరూపాన్ని తయారు చేస్తారు. 14వ తేదీ వేకువజామున విశ్వరూప ప్రతిమ చెంప తొలిగించడంతో జాతర పరిసమాప్తమవుతుంది.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పండుగ వాతావరణంలో నిర్వహిద్దాం : కలెక్టర్

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జాతరను పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జాతరపై ఆయన సమీక్షించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. సోమవారం ఆయన ఆలయాన్ని పరిశీలించి, అధికారులకు, పోలీసులకు తగు సూచనలు ఇచ్చారు.

క్రిస్ సిటీతో రియల్ ఎస్టేట్ దూకుడు

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వెంచర్లు
- ఎకరా రూ.2.5 కోట్లకు పైమాటే

కోట, మే 5 (ఆంధ్రజ్యోతి): క్రిస్ సిటీ, చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్ రానుండడంతో కోట మండలంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. ఎడాపెడా వెంచర్లు వేస్తూ వ్యాపారం షురూ చేశారు. కోట మండలం కొత్తపట్నం, చిల్లకూరు మండలం తమ్మినపట్నం ప్రాంతాల్లో క్రిస్ సిటీ రానుంది. దీనికి సంబంధించిన పనులు వేగం పుంజుకున్నాయి. 250 నుంచి 300 పరిశ్రమల వరకు రానుండడంతో సముద్రతీర గ్రామాలన్నీ ఇండస్ట్రియల్ హబ్‌గా మారిపోనున్నాయి. సముద్రతీరానికి 20నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోట, విద్యానగర్ ప్రాంతాల్లో ఇప్పటికే ఆక్వా పరిశ్రమలు ఉన్నాయి. దీనికితోడు క్రిస్‌సిటీ, చెన్నై-బెంగళూరు కోస్టల్ కారిడార్ ద్వారా కృష్ణపట్నం పోర్టు అనుసంధానం జరగనున్న నేపథ్యంలో కోట మండలంలోని సముద్రతీర గ్రామాలైన కొత్తపట్నం, శ్రీనివాససత్రం, గోవిందపల్లి, గోవిందపల్లిపాళెం, వావిళ్లదొరువు, గున్నంపడియ, యమదిన్నెపాళెం, సిద్ధవరం, కర్లపూడి గ్రామాల్లో భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి.



కోట పట్టణంలో వెలసిన కొత్త వెంచర్



విద్యానగర్‌లో సిద్ధం చేసిన ప్లాట్లు

రూ.వేల నుంచి రూ.లక్షలకు..

విద్యానగర్‌లో హనుమాన్ నగర్, గూడలి రహదారిలో గతంలో అంకణం రూ.40వేల నుంచి రూ.60వేలు పలుకుతుండగా ప్రస్తుతం రూ.2.30లక్షల వరకు పలుకుతోంది. చెందోడు, విద్యానగర్ ప్రాంతంలో ఎకరం రూ.2.5కోట్లకు పైనే పలుకుతోంది. చల్లకాలువ, స్వర్ణముఖి సమీపంలో కొత్తగా వేసిన వెంచర్లలో అంకణం రూ.1.20లక్షల నుంచి 1.40 లక్షలు పలుకుతోంది. ఆ ప్రాంతంలో ఎకరం రూ.2కోట్లకు పైగా పలుకుతోంది. ఇక కోట పట్టణానికి వస్తే అంబేడ్కర్ గురుకులం, రవినగర్ ప్రాంతాల్లో అంకణం రూ.1.50లక్షల నుంచి 1.60లక్షలు పలుకుతోంది. ఇంకొంచెం పట్టణంలోకి వెళితే రూ.1.70లక్షలు పలుకుతోంది. కోట పట్టణంలోనూ భూముల ధరలు బాగా పెరిగాయి. అదేవిధంగా గోవిందపల్లి, సిద్ధవరం, కర్లపూడి గ్రామాల్లో ఒకప్పట్లో ఎకరం రూ.10లక్షలు ఉండగా ప్రస్తుతం సెటిల్‌మెంట్ భూమి ఎకరం రూ.30 నుంచి రూ.40లక్షల వరకు పలుకుతోంది. కాగా, సముద్రతీర ప్రాంతాల ప్రజలు భూములు, ఆస్తులు పరిశ్రమలకు వదిలివేసి విద్యానగర్, కోట ప్రాంతాల్లో స్థిర నివాసాలు ఏర్పరుచుకునేందుకు పరుగులు తీస్తున్నారు. భూముల ధరలు పెరగడానికి ఇది కూడా ఒక కారణంగా చెప్పవచ్చు.

రైతులకు పరిహారం అందించండి

జిల్లా అధికారులతో సీఎం చంద్రబాబు

తిరుపతి(కలెక్టరేట్), మే 5 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సీఎం చంద్రబాబు జిల్లా అధికారులను ఆదేశించారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశముందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విజయవాడ నుంచి సోమవారం వర్చువల్ విధానంలో ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. పిడుగుపాటుకు నాయుడుపేట, చిల్లకూరు, ఓజిలిలో ముగ్గురు మృతి చెందారని, 30శాతం లోపు పంట నష్టం వాటిల్లిందని కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మృతుల కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని సీఎం ఆదేశించారు. పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ గురించి కూడా కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించి నష్ట నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

బిగ్‌బాస్ షోపై నా పోరాటం ఫలించింది

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



తిరుపతి(ఆటోనగర్), మే 5(ఆంధ్రజ్యోతి): బిగ్‌బాస్ షో నిర్వాహకులపై తాను కొన్నేళ్లుగా చేస్తున్న పోరాటం ఫలించిందని, హైకోర్టు నోటీసులు పంపడం శుభపరిణామమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ బిగ్‌బాస్ షోలు, అందాల పోటీలను నిర్వహించడం నీచ సంస్కృతి అన్నారు. ఈ కార్యక్రమాలు నిర్వహించడం ముమ్మాటికీ అసాంఘిక చర్యగా అభివర్ణించారు. బిగ్‌బాస్ షో ద్వారా సమాజానికి హాని ఉందన్నారు. ఈ షోలకు ప్రజలు ఆకర్షితులై దేశ సంస్కృతిని చిన్నచూపు చూసే అవకాశముందన్నారు. బిగ్‌బాస్ షోలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను ఆపాలని పోలీస్ స్టేషన్లను, కోర్టులను ఆశ్రయించానని చెప్పారు. మూడేళ్లుగా ఈ పోరాటం చేస్తూ చివరకు హైకోర్టును ఆశ్రయించామన్నారు. కొంత కాలయాపన జరిగినా చివరకు హైకోర్టు బిగ్‌బాస్ షో నిర్వాహకులకు నోటీసులు పంపడం ఆనందంగా ఉందన్నారు. బిగ్‌బాస్ షోల ద్వారా నిర్వాహకులు సమాజానికి ఎలాంటి మెసేజ్ ఇవ్వాలనుకున్నారో వివరణ ఇవ్వాలన్నారు. స్త్రీలను గౌరవిస్తున్న మన దేశ సంస్కృతిలో ఇలాంటి షోలు అవసరమా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణాలో అందాల పోటీలు నిర్వహించడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రపంచ దేశాలు భారత దేశ సంస్కృతి వైపు చూస్తుంటే కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం స్త్రీలను పాశ్చాత్య సంస్కృతి వైపు మళ్లించే ప్రయత్నాలు చేయడం అన్యాయమన్నారు. దేశ ప్రజలపై ఇలాంటి ప్రభావాలు పడకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ నాయకులు ఎ.రామానాయుడు, పి.మురళి, రాధాకృష్ణ, సి.పెంచలయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

దిగుబడి లేక.. ధర రాక

పడిపోయిన ఎండు మిరప రేట్లు

ఆందోళనలో అన్నదాతలు

సూళ్లూరుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి, రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పండించిన పంటలు అన్నదాతల పాలిట కన్నీటి రాశులుగా మారుతున్నాయి. కోటి ఆశలతో మిరపను సాగు చేసిన రైతులకు కన్నీటి కష్టాలు తప్పడం లేదు. రూ.లక్షల పెట్టుబడి పెట్టి పంటను సాగుచేస్తే ఓ వైపు దిగుబడులు రాక, మరోవైపు మార్కెట్లో ధరలు అమాంతం పడిపోవడంతో కొనేవారు లేక రైతులు కుదేలవుతున్నారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లోని మంగళంపాడు, మతకాముడి, ఉగ్గుముడి, దామానెల్లూరు, ఉచ్చూరు, బూదూరులో 2 వేల ఎకరాలకు పైగా మిరప సాగు చేశారు. విత్తనాలు, ఎరువులు, ఇలా అన్ని కలుపుకుని ఎకరాకు రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టారు. పచ్చి మిరపకాయలకు ధర లేకపోవడంతో ఎండు మిరపపై ఆశలు పెట్టుకున్నారు. కోత పనులు కూడా పూర్తయ్యాయి. అయితే ధర లేకపోవడంతో మిరపను కల్లాల్లోనే కుప్పలుగా ఆరబోసి పెట్టుకున్నారు. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి కేవలం 15 క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా ధర రూ.10 వేల నుంచి రూ.12 వేలు పలుకుతోంది. రెండేళ్ల కిందట క్వింటాలు రూ.23 వేల నుంచి రూ.26 వేలు వరు ఉండగా, గత ఏడాది రూ.14 వేల నుంచి 16 వేల వరకు తగ్గింది. ఈ ఏడాది ధరలు బాగా తగ్గడంతో కనీసం పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రెండేళ్ల నుంచి మిరప ధరలు దారుణంగా పడిపోవడంతో కౌలు చెల్లింపు కూడా గిట్టడం లేదని కన్నీరుమున్నీరవుతున్నారు.



కల్లంలో ఆరబోసిన ఎండు మిరప

చెత్త నిర్వహణకు ఐటీసీతో ఒప్పందం

- తిరుపతి కార్పొరేషన్, పుత్తూరు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీల ఎంపిక

పుత్తూరు అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెత్త నిర్వహణకు ప్రభుత్వం ఐటీసీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు పుత్తూరు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. రెండు రోజుల క్రితం ఆయా మున్సిపాలిటీల ఇంజనీరింగ్ అధికారులు విజయవాడలో ఐటీసీ సంస్థ నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి వెళ్లి వచ్చారు. ఐటీసీ సంస్థ తడి, పొడి చెత్తను వేరు చేయడం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. కాగితం, ప్లాస్టిక్, లోహాలు వంటి పొడి వ్యర్థాల సేకరణకు ప్రత్యేక సంచులను అందజేస్తుంది. సేకరించిన చెత్తను ఎరువుగా మార్చి విక్రయిస్తుంది. ఇందులో భాగంగా రీసైక్లింగ్ ప్లాంట్ ఏర్పాటుకు పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ సిబ్బందితో కలిసి పరమేశ్వరమంగళం సమీపంలోని సర్వే నెం.218లో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు.



స్థల పరిశీలన చేస్తున్న పుత్తూరు కమిషనర్ మంజునాథ్ గౌడ్

సూళ్లూరుపేట కమిషనర్‌పై ఫిర్యాదు

చిత్తూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్యపై చిత్తూరులో పోలీసులకు ఫిర్యాదు అందింది. సోమవారం చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ స్థానిక వన్ టౌన్ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. 'చిన్నయ్య తన తండ్రి బతికుండగా, ఆ విషయాన్ని దాచిపెట్టి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందాడని, తర్వాత తప్పుడు సర్టిఫికెట్లను అందజేసి పదోన్నతులు పొందాడు' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్ర మునిసిపల్ పరిపాలన శాఖ (డీఎంఏ) ఆదేశాలతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పోలీసులు విచారణ ప్రారంభించారు.

షార్‌లో ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



ఎన్‌ఎఫ్‌ఎస్‌సీ డైరెక్టర్ సింఘూనేకు జ్ఞాపిక అందజేస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, పక్కన కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో సోమవారం జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు ముగిశాయి. బ్రహ్మప్రకాష్ హాలులో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు వేడుకలు నిర్వహించారు. నాగపూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీసెస్ కాలేజ్(ఎన్‌ఎఫ్‌ఎస్‌సీ) డైరెక్టర్ ఎన్‌బీ సింఘూనే ముఖ్య అతిథిగా విచ్చేసి అగ్నిమాపక వారోత్సవాల ప్రాముఖ్యం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, ఎంఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ, ఎస్‌వోఎస్‌ఈ సీజీఎం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విందూరు రోడ్డును అభివృద్ధి చేయండి

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి సైదాపురం మండలం గిద్దలూరుకు విందూరు మీదుగా వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఈఈ రామాంజేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గూడూరు నుంచి గిద్దలూరుకు విందూరు మీదుగా వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారిందన్నారు. ఈ మార్గంలో ఉన్న 15 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాత్రి వేళల్లో గోతులు కనిపించిక వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో సునీల్, బ్రహ్మయ్య, వేమయ్య, సుబ్బరామరాజు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎన్‌ఎంయూఏ నేతలు

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎంయూఏ నాయకులు కోరారు. సోమవారం తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన సిబ్బందికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించడంతో పాటు వృద్ధాప్య పెన్షన్‌ను అందజేయాలన్నారు. మహిళా కండక్టర్లకు సంబంధించి అన్ని రకాల సెలవులను అమలు చేయాలని కోరారు. అలాగే అర్హత ఉన్నవారందరికీ పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ప్రవీణ్, గౌస్, పోలయ్య, బాబురావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి కార్యకర్తలే బలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

కోట, మే 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఖచ్చితంగా గుర్తింపు ఇస్తామని, ఇందులో ఎక్కడా రాజీపడే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అన్నారు. కోటలో సోమవారం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అన్ని విభాగాల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఇటీవల టీడీపీ మండల అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన మద్దాలి సర్వోత్తమరెడ్డిని తిరిగి ఆహ్వానించారు. తనకు ఎవరితోనూ విభేదాలు లేవని, ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆదేశాలతో పార్టీలో కీలకంగా వ్యవహరిస్తానని సర్వోత్తమరెడ్డి సభాముఖంగా ప్రకటించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ పటిష్టత కోసం అందరితో కలిసి పనిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలోని నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకుంటానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దశరధరామిరెడ్డి, జలీల్ అహ్మద్, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మధుయాదవ్, గండవరం కృష్ణారెడ్డి, తీగల సురేష్‌బాబు, మస్తాన్‌బాషా, కోటేశ్వరరెడ్డి, నారాయణ, షంషొద్దీన్, పోలయ్య, వెంకటకృష్ణారెడ్డి, సుహాసిని, పోలమ్మ పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలను పరిష్కరించండి



ధర్నా నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను విడివిడిగానే నిర్వహించాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యారంగంలో గత వైసీపీ ప్రభుత్వం అవలంభించిన విధానాలనే నేటి ప్రభుత్వం కొనసాగిస్తుండడంతో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయని, వాటిని సరిచేయాలన్నారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, సుబ్రహ్మణ్యంరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

వెంకటగిరి, మే 5:(ఆంధ్రజ్యోతి) సమస్యల సాధన కోసం సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ నాగజ్యోతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్రహ్మణ్యం, శ్రీకృష్ణ, సాయిరామ్, భాస్కర్ యాదవ్, శంకరయ్య, కిషోర్‌బాబు, బోడా రమణయ్య, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు

8నుంచి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు

చిల్లకూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను ఈనెల 8నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నారన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమ వారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆయన నివాసంలో ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేం దుకు ఉత్సవ కమిటీని నియమించడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఈవో రవికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ నెల్లటూరు చిరంజీవి, బాబి పాల్గొన్నారు.

చదరంగంలో సత్తాచాటిన జశ్వితారెడ్డి



పెళ్లకూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలచ్చూరు గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, అనూష దంపతుల కుమార్తె జశ్వితా రెడ్డి చదరంగంలో సత్తా చాటింది. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో అండర్ 9 బాలికల విభాగంలో జశ్వితారెడ్డి ప్రతిభ చూపి నాలుగవ స్థానంలో నిలిచింది.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రోత్సాహం: పాశిం

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్రప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో సీపీ హ్యాచరీస్‌కు చెందిన ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వాకాడు మండలం తూపిలిపాళెం గ్రామంలో సీపీ హ్యాచరీస్ సంస్థ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తూ, నాణ్యమైన రొయ్యల పిల్లలను ఉత్పత్తి చేస్తూ రొయ్యల సాగుకు సహకారం అందిస్తూ వచ్చిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమల నిర్వహణకు ఎటువంటి ప్రోత్సాహకాలు అందించకపోవడంతో ఈ సంస్థను మూసివేయడం జరిగిందన్నారు. దీంతో ఈ పరిశ్రమపై ఆధారపడి పనిచేసే వేలాది మంది కార్మికులకు పనులు లేకుండా నిరుద్యోగులుగా మారారన్నారు. రాష్ట్రప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టిందని, మూతపడిన సీపీ హ్యాచరీస్‌ను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పరిశ్రమ ప్రతినిధులతో చర్చించి తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, త్వరలోనే పరిశ్రమను పునః ప్రారంభించి స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, రొయ్య రైతులకు



ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌తో సీపీ హ్యాచరీస్ ప్రతినిధులు

నాణ్యమైన రొయ్యపిల్లలను అందించేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమ ప్రతినిధులతో చర్చించడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధి లద్వాన్, మనోజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ నగదు స్వాహాపై విచారణ

వెల్ఫేర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

కోట, మే 5 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కేశవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ పెన్షన్ స్వాహా విచారణ సోమవారం జరిగింది. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ మనోజ్‌తో పాటు మండల పరిషత్ అధికారులు కేశవరం సచివాలయానికి చేరుకుని ఏప్రిల్, మే మాసాలకు సంబంధించి పెన్షన్ నగదుపై వెల్ఫేర్ అసిస్టెంట్ అనీల్‌ను విచారించారు. ఏప్రిల్‌లో డీఆర్‌డీఏకు జమ చేయాల్సిన రూ.1,30,500 నగదును ఈనెల 2వ తేదీ గ్రామస్తుల సమక్షంలో అధికారుల వత్తిళ్ల మేరకు జమ చేసినట్లు గుర్తించారు. అదేవిధంగా మే నెలకు సంబంధించి రూ.1.12లక్షల పెన్షన్ నగదును వెల్ఫేర్ అసిస్టెంట్ ఇప్పటికీ డీఆర్‌డీఏకి జమ చేయలేదు. నగదు స్వాహాపై అధికారులు విచారిస్తుండగా ఒక్కసారిగా వెల్ఫేర్ అసిస్టెంట్ పరిగెత్తుకుంటూ వెళ్లి సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న జామాయిల్ తోటలోకి వెళ్లి పురుగుమందు తాగి పడిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఆయనను గూడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించగా కోలుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి



కేశవరం సచివాలయంలో సిబ్బందిని విచారిస్తున్న అధికారులు

అల్లాబక్షు మాట్లాడుతూ ఈనెల 2న ఆంధ్రజ్యోతిలో రూ .1.50లక్షల పెన్షన్ నగదు స్వాహాపై వార్త ప్రచురితం అయిందని, దీనిపై విచారణ చేయగా వాస్తవమేనని తేలిందన్నారు. ఈ క్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం ప్రయత్నం చేశాడని, ప్రస్తుతం ఆయన పరిస్థితి మెరుగ్గా ఉందని పంచాయతీ కార్యదర్శి చెప్పారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నయం చేయొచ్చు



దగ్గవోలులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

డక్కిలి, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నయం చేయొచ్చునని స్థానిక ప్రభుత్వ వైద్యాధికారిణి బిందుప్రియాంక తెలిపారు. తిరుపతిలోని వెంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం డక్కిలి మండలంలోని దగ్గవోలు, సంగనపల్లి గ్రామాల్లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మమోగ్రాం, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్ గుర్తించేందుకు 35 ఏళ్లు దాటిన మహిళలందరూ మెమూగ్రాం పరీక్షలు విధిగా చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 22వ తేది వరకు వైద్య శిబిరాలు జరుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి నాగరాజు, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ చైతన్య భాను, డాక్టర్ పద్మావతి, సంగనపల్లి, దగ్గవోలు సర్పంచులు చిరంజీవులు, కోలా చిన్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు రమేష్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధర్మరాజస్వామి ఉత్సవాలు

తడ, మే 5 (ఆంధ్రజ్యోతి): పంచపాండవ ద్రౌపది సమేత ధర్మరాజ స్వామి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఆదివారం అర్ధరాత్రి తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం పంచపాండవుల విజయ సోపాన గ్రామోత్సవం జరిగింది. సోమవారం ధర్మరాజస్వామికి పట్టాభిషేకం వేడుకలను వేదపండితులు శాస్త్రోత్తంగా నిర్వహించారు. సాయంత్రం పట్టాభిశక్తులైన ద్రౌపది సమేత ధర్మరాజు పుష్ప వాహనంలో విజయయాత్ర గ్రామోత్సవం జరిపారు. రాత్రి శయనసేవ నిర్వహించి ఉత్సవాలను ముగించారు.

అత్తివరంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

ఓజిలి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం అత్తివరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం టీడీపీ నేత ఎల్లు గురుమూర్తి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం నిర్వహించారు. తెలుగు యువత నాయకులు, గురుమూర్తి అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో దంత వైద్యుడు కనుమూరు క్రాంతికుమార్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు, కుందాం సొసైటీ మాజీ అధ్యక్షుడు కనుమూరు గోపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాలు



దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న డాక్టర్ రోహిణి

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్‌క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, డాక్టర్ తనూజ, విరజ, అనిత, శశిరేఖ, భవానీ, సుధీర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

గూడూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేదలకు తిరుమలశెట్టి నారాయణ దాతృత్వంతో ఆహార పొట్లాలను అందజేశారు.

వీధి లైట్లను బాగు చేయండి

వెంకటగిరి టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 14వ వార్డులో వీధి లైట్లను బాగు చేసి వెలిగేలా చూడాలని స్థానికులు కౌన్సిలర్ ఆరి శంకరయ్యను కోరారు. సోమవారం 8వ సచివాయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

మహిళకు కుట్టుమెషిన్ అందజేత

కోట, మే 5 (ఆంధ్రజ్యోతి): కోటలోని షిరిడిసాయి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నిరుపేద మహిళకు కుట్టుమెషిన్ అందజేశారు. వాకాడు మండలం సిద్దిగుంటపాళెం గ్రామానికి చెందిన వాకాటి శ్రీలక్ష్మి నిరుపేద. ఆమె కుట్టు, అల్లికలు నేర్చుకుంది. కుట్టుమెషిన్ కొనుక్కునేందుకు ఆర్థిక స్థోమతలేక షిరిడిసాయి అక్షయ సేవా సమితిని ఆశ్రయించింది. స్పందించిన ఆ సంస్థ ప్రతినిధి అల్లం రమణయ్య నెల్లూరుకు చెందిన రావూరి వెంకటేశ్వర్లు దాతృత్వంతో శ్రీలక్ష్మికి కుట్టు మిషను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కోటేశ్వరరెడ్డి, సుబ్బయ్య, పన్నగ సాయి, బాబురావు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



డీటీ ప్రసన్నరాణికి వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నేతలు

డక్కిలి, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపూరు క్రాస్ రోడ్డులో సర్వే నంబరు 522లో అంబేడ్కర్ విజ్ఞాన మందిరం కోసం దరాఖాస్తు చేసుకున్న స్థలాన్ని ఇతర ప్రాంతాలకు చెందిన కొంతమంది నకిలీ పట్టాలతో ఆక్రమించుకుని గుడిసెలు వేస్తున్నారని ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గద్దల మునెయ్య ఆరోపించారు. సోమవారం వారు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మలమహానాడు నాయకుడు మునెయ్య, ఎరుకుల హక్కుల పోరాట కమిటీ నాయకుడు రవి, ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేది మండల అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెసర సాగుపై అవగాహన



విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి

వెంకటగిరి టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం వద్ద రైతులకు శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి పెసర సాగుపై అవగాహన కల్పించారు. రైతులు వరి కోసిన తరువాత ఆరుతడి పంటగా పెసర సాగు చేసుకోవాలన్నారు. పెసర సాగులో రకాలు, విత్తన మోతాదు, విత్తన శుద్ధి, పోషకాలు, నీటి యాజమాన్యం, కలుపు, తెగుళ్ల నివారణ గురించి వివరించారు. ఎల్‌జీజీ-607 పెసర విత్తనాలు మేలు రకమని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజీవన, విజయశ్రీ, నాగార్జున రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్ల నిర్మాణానికి కృషి చేయండి



ఎంపీ గురుమూర్తితో వెంకటకృష్ణారెడ్డి తదితరులు

నాయుడుపేట టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట నుంచి తూర్పుకనుపూరు వరకు నూతనంగా నిర్మిస్తున్న సాగరమాల జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్ల నిర్మించేలా చూడాలని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తికి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు వినతిపత్రం అందజేశారు. సోమవారం తిరుపతిలో ఎంపీని కలసి సర్వీస్ రోడ్ల నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయసారధి రెడ్డి, సురేష్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, భవదీప్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో విజిలెన్స్ తనిఖీలు

సూళ్లూరుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. డిపోలో పరిపాలన విభాగంలో పనితీరు, అక్రమాలపై నెల్లూరు విజిలెన్స్ డీఎస్పీ ధర్మతేజ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆరాతీసి పలు రికార్డులను పరిశీలించినట్లు తెలిసింది. గత మూడేళ్ల నుంచి డిపోలో పాలన గాడితప్పడమే కాకుండా గతంలో నడుస్తున్న 60 బస్సులు సర్వీసులు నేడు 29కి చేరాయి. అలాగే తరచూ బస్సు సర్వీసులు రద్దు చేయడం పరిపాటిగా మారింది. సిబ్బంది ఉన్నా సర్వీసులను ఎందుకు రద్దు చేస్తున్నారు.. డిపోకు ఆదాయ చేకూర్చే మార్గాల్లో సర్వీసులు పెంచుకోకుండా ఎందుకు కుదిస్తున్నారన్న దానిపై విజిలెన్స్ అధికారులు విచారించారు. ఏప్రిల్ 20న ఒకేరోజు డిపోలో 17 సర్వీసులను రద్దు చేశారు. దీనిపై కూడా ఆరా తీసినట్లు తెలిసింది. కనుపూరు జాతరకు స్పెషల్ సర్వీసులకు నడిపినా సిబ్బందికి నగదు చెల్లించలేదని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. అదే విధంగా ఏళ్ల తరబడి కొంతమంది సిబ్బంది విధులకు డుమ్మాకొట్టి ఓడీల్లో ఎందుకు ఉంటున్నారన్న అంశంపై ఆరా తీశారు. షెడ్యూల్ ప్రకారం బస్సులను ఎందుకు నడపటం లేదు తదితర వివలాన్నింటినీ సేకరించారు.

పోలేరమ్మ హుండీ లెక్కింపు



హుండీ నగదు లెక్కిస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో సోమవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 50 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.2,29,216 ఆదాయం వచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మంగళవారం, బుధవారాల్లో జాతర నిర్వహించనున్న నేపథ్యంలో ముందస్తుగా హుండీ నగదును లెక్కించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవో రవికృష్ణ, పెద్దకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి, జాతర కమిటీ అధ్యక్షుడు నానబాల సుబ్బారావు, సభ్యులు గోపి, శ్రీనివాసులు, శ్యామ్, రామారావు, ధనుంజయ, అన్నమనేని సాయి, స్థానికులు అంజయ్య, చిరంజీవి ఆచారి, నిత్య కృష్ణారెడ్డి, దాసరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం



టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంలో మూడు నెలల పాటు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, కమిషనర్ ఫజులుల్లా, నాయకులు పార్థసారధి, గూడూరు సుధీర్‌రెడ్డి, పోట్లపూడి రాజేష్, దార్ల రాజేంద్ర, తుపాకుల కన్నెమ్మ, చేవూరు చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ బ్రహ్మనాయుడు

సూళ్లూరుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రౌడీ షీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్‌ఐ బ్రహ్మనాయుడు మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులకు దూరంగా ఉండాలన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టామని, రాత్రి సమయాల్లో గస్తీలో ఉండే పోలీసు సిబ్బంది రౌడీ షీటర్లు ఉండే నివాసాలను ఖచ్చితంగా తనిఖీ చేస్తారని చెప్పారు. రౌడీ షీటర్లు బయట ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలన్నారు. కౌన్సెలింగ్ ద్వారా ప్రవర్తనలో మార్పు వస్తే వారిపై రౌడీషీట్ ఎత్తివేసేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని ఎస్‌ఐ చెప్పారు.

రేపటినుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

సూళ్లూరుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జీఎన్‌టీ రోడ్డులో వెలసిన మద్విరాట్ పోతులూరు వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఈ నెల 7నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు చిట్టేటి పెరుమాల్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన ప్రతులను సోమవారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. తొలిరోజు 7న గణపతి పూజ, గోపూజ, హోమం, 8న స్వామి, అమ్మవార్ల కల్యాణం. 9న ఉదయం హోమం, రాత్రి గ్రామోత్సం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో చిట్టేటి రామదాసు, చిట్టేటి విజయ్‌కుమార్, చెంగయ్య, బట్టా సుబ్రహ్మణ్యం, నూలేటి రమణయ్య సతీష్, వెంకటేశ్, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు పండ్ల పంపిణీ

గూడూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ విద్యుత్‌శాఖ ఏఈ ఏడుకొండలు దాతృత్వంతో బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. గౌరీ, సురేష్, మల్లి, శ్రీహరి పాల్గొన్నారు.